పరుగెత్తుకుంటా వచ్చేసింది ఒక పంది. తపసు జేస్కుంటా వుండే టోడెల్లా దిగ్గున లేసాడు. కోపం చిర్రెత్తుకొచ్చింది. తటాల్న బాణాలందు కోని... లాగి పెట్టి యేసినాడు. ఆ పందికాస్తా చచ్చూరుకుంది. దీన్తస్సా దియ్యా... యిదీ నేనియ్యాల యేటాడిన పంది... అని నిండా మురిసిపోక ముందే... మరొకడు లగెత్తుకుంటా వొచ్చేసినాడు. నాదీ ఆ పంది. తొలి బాణం నాటింది నేనూ... అంటా తగువు పెట్టుకున్నాడు. వోడి దగ్గర గూడా బాణాలుండాయి. సూట్టానికి యేటగాడి మాదిరిగానే వుండాడు. అట్టాగని యీడూరుకోలా. యిద్దురూ సవాళ్లిసరుకున్నారు. మాటలు ముదిరి సేతల్లోకొచ్చినాయి. చేతులకి విల్లులు మొలిసినాయి. అమ్ములు దూసినారు. ఒకరి మీదొకరు యేసుకుంటా వుండారు.



**కె.ఎ. మునిసురేష్ పిళ్లె 100కు పైగా కథలు రాశారు. రెండు కథాసంపుటాలు- పూర్ణమూ నిరంతరమూ, రాతి తయారి; ఒక నవల ప్రచురించారు. జర్నలిజం వృత్తిలో ప్రస్తుతం ఫ్రీలాన్సర్‌గా ఉన్నారు. నివాసం హైదరాబాదు.**



యమాగా సాగిపోతండాది కిరాతార్జున బాగోతం. అర్జునుడి యేసగాడు ఒక్కో బాణమూ తీసి లాగిపెట్టి నానా మంత్రాలూ పజ్జేలు జదివి యిడస్తండాడు. అది యెగిరి బారడు దూరంలో పడతండాది. అవతల్నించి కిరాతుడి యేసంలో వుండే శివయ్య యేసంలో ఉండే వోడు గూడా తడవకో బాణం వదలతండాడు. అయి గూడా అలా గాల్లోకి ఎగిరి కాసింత దూరంలో పడిపోతండాయి. పజ్జేలే పజ్జేలు... బారెడున్నర రాగాలు తీసి ఆలపిస్తండారు. సుట్టూరా యెట్టా జూసినా జెనమే జనం. ఆలకిస్తాండారు. కొంచేపుటికి పజ్జేలన్నీ అయి పొయినాక... అప్పటిదాకా యెవుడి మీదికైతే బాణాలేసి నాడో వాడు బోయోడుగాదు శివయ్య అనే సంగతి అర్జునుడికి దెల్సిపోయింది. కుమిలిపొయినాడు. అడుక్కున్నాడు. పడీ పడీ మొక్కినాడు. సామీ నన్ను చెమించాల అన్నాడు. అపరాదం జరిగి పోయిందీ అన్నాడు. శివయ్యకి మామూలుగానే కుడుమిస్తే పండగ. పడీపడీ మొక్కినాక పడిపోకుండా వుంటాడా? కనికరించేసినాడు. 'వురేయ్ అర్జునా... నీ మంత్రాల బాణాలన్నీ మామూలోళ్లకాడనే పనికొస్తాయిరా... యిదిగో నేనిస్తండా తీస్కో పాసుపతం... యిది మొనగా డెంకన్నుల్ని గూడా మెడలొంచి పడగొడ్తాది...' అన్నాడు. యిప్పుడింక అర్జునుడిగ్గూడా పండగే పండగ.

మాది శ్రీకాళాస్తి దగ్గిర్లో సిన్నపల్లి. మా వూరు కాళాస్తని జెప్పేటప్పుడు మాకు బలె కుశాలగుంటాది. సాలెపురుగూ, పామూ, ఏనుగూ! పురుగులకీ జంతువులకీ మోచ్చమిచ్చేసిన పిచ్చోడు మా శివయ్య. మోచ్చాన్ని గూడా యాపారం జేస్కోవచ్చని... గుండ్లు గొట్టేటోల్లకీ, బజన్లు జేసేటోల్లకీ, వుండీల్లో దుడ్లు దండిగా యేసేటోల్లకి మోచ్చాన్ని అమ్ముకోవచ్చనీ మా శివయ్యకి తెల్దు. మా వూళ్లో శివయ్య గుడి అందురికీ దెల్సు. యీడ దరంరాజులకి గూడా వొక గుడి వుండాదని మాబోటి పల్లెటూరోల్లకే దెల్సు. గుడి సిన్నదే. యెకరాల కొద్దీ నేల బావురుమంటా వుంటాది. యెప్పుడూ... తన మింద ఆడుకోడానికి రమ్మంటూ పసిపిలకాయిల్ని రెచ్చగొట్టి పిలస్తా వుంటాది. యేడాదికోమారు ఆసాడంలో మాత్తరం యీడ దరంరాజుల తిరనాల జరగతాది. తిరనాల పద్దినాలు వుంటాదిగానీ... తపసు, గుండాం రోజుల్లో మాత్తరం యిసకేస్తే రాల్దంటే నిజ్జెం.

ఆ తిరనాలలోనే, అర్జునుడి తపసుమాను కాడ కాసింత దగ్గర్లోనే నిలుచుకోని చూస్తాండం నేనూ అరితా. ఆ యమ్మికి యిదంతా శానా సిత్రంగా కనిపిస్తాండాది. అందులో అనుమానం లేదు. యెనక నించి వొకమ్మ అరితను సేత్తో తట్టి... "రొవంత జరుక్కోయేమికా.. కనపట్టంలే,"దంది.

యీ పిల్ల బిత్తరపోయింది. యెందుకంటే ఆ యమ్మకు ఓ యాబయ్యుంటాయి. యీ పిల్లకి యింకా యిరవై గూడా రాలా! మద్దెలో నేన్దూరి... "రొవ్వంత ఆగేమి కా.. అర్జునుడింక మానెక్కేస్తం డాడ్లే," అన్నా.

మద్దెలో వుండాది తపసుమాను. పెద్ద తాటి మాకును దెచ్చి నిటారుగా నాటినారు. దానికి మెట్లు మాదిరిగా రెండు పక్కలా కూసాలు గొట్టినారు. అర్జునుడు బుజానికి జోలి తగిలించుకోని... మిగిలి పోయిన పజ్జేలన్నీ పాడుకుంటా... వొక్కొక్క మెట్టూ యెక్కినాడు. కొనాకి యెక్కి గూట్లో గూసున్నాడు. యింకొన్ని మంత్రాలు జదివినాడు. ఆనాక జోలి దీసినాడు. జెనవంతా గోలగోల. అందురూ ముందర

ముందరకి నెట్టుకోనొస్తండారు. గొడుగులు యిప్పి యెల్లకిలా పట్టుకునేటోల్లూ... కోక కొంగులు పైకెత్తి యిశాలంగా యిప్పి పట్టుకునేటోల్లూ... అంతా మిడిమేలంగా వుండాది. అర్జునుడు జోలిలోంచి యిబూదిపండ్లూ, నిమ్మపండ్లూ దీసి తలోదిక్కు యిసిరినాడు. జెనం యెగబడి దొరకబుచ్చుకున్నారు. అన్నీ జల్లేసినాక జోలి కాలీ అయింది. జెనం కాలీ అయినారు.

నేనూ అరితా మిగిల్నాం. అంగల్లోల్లు సర్దుకుంటండారు. మేం నడస్తండాం.

“సేమ్యా అయిసు దింటావా” అనడిగినాను. మొహం ముడేసి తలడ్డంగా వూపింది. “మీ యమ్మకు జెప్పన్లే..” అన్నా. నవ్వింది. తీరా అయిసుబండోడు నా పరువు దీసినాడు. సేమ్యా అయిసు సప్పరించినాక... పెద్ద బాలేదన్నట్టుగా మూతిరిసింది. “ఐతే పాలైసు దీస్కో కా,” అన్నాడు అయిసోడు. అది గూడా గిట్టించుకుందామని.

“సాల్లేనా... అది మాత్రం బాగుంటాదని రాసిస్తావా,” అని గసురుకున్నా.

పిల్ల- అయిసు మీద అయిసు దినేసి జలుబు పట్టుకునిందంటే కస్టం. పుల్లకుండే చెమ్మ ఆరిపోయే దాకా నాకేసింది. వోడికి అయిదు రూపాయల బిళ్లిచ్చినా. అంతేనా అని అనుమానంగా జూసింది. “మా సిన్నప్పుడు పదైదు పైసలే. పాలైసైతే పావలా. కానీ పావలా యెవురికాడా వుండదు కదా... యిదే తినేటోల్లం...” యివరంగా జెప్పుకుంటా తీస్కపోయినా. యిద్దరం నిదానంగా నడుసుకుంటా బస్టాండుకి బోతన్నాం.

“వాడ్డిడ్ దట్ వుమన్ సే టూ మీ,” నడస్తాంటే కాసేపటికి అడిగింది.


యింగ్లీసు మాటొస్తే మనం దాని అర్దం పట్టుకుంటాం. ఆ పాటి సదూకున్నాం. కానీ, యిలా తటాల్న పిడుగులాగ పడిపోతే కొంచిం కస్టం. రవంత ఆగి, “పక్కకి జరుగు అక్కా అంది,” అన్నా.

అరిత పెద్దగా నవ్వేసింది. “నన్ను అక్కా అంటుందా... మా పిన్ని ఏజ్ ఉంటుంది తనకి,” తెలుగులోకి మారిపోయింది. ఆ పిల్లకి తెలుగొచ్చు. కానీ పరాకులో అలవాటుగా యింగ్లీసులో మొదలెడ్తాది. నేను గూడా నవ్వాను.

“నువ్వు కూడా తనని అక్కా అన్నావ్... నీకంటె చాలా చిన్నదానితో...” మళ్లీ పగలబడి నవ్వింది.

ప్యాంట్లూ సొక్కాలూ యేసుకునే ఆడోళ్లు మా కాలాస్తిలో గూడా వుండారు... గానీ, రోడ్లో జెనం ఈ యమ్మిని యిచిత్రంగా జూస్తండారు. పక్కన ముతక పంచిలో నేనుండాననో, అట్టా నవ్వతండాదనో మరి? “సిన్నదైతే యేంది... ఆడకూతుర్ని యింకేం అనేది,” అన్నాన్నేను. అంతకు మించి యింకో యోచన రాలా.

బస్సుకోసం నిల్చుకోనుంటే వొక ముసిల్దొచ్చింది నా కాడికి. కర్ర



తాటించుకుంటా నడస్తుండాది. కళ్ల మింద అరిచెయ్యి నీడ బెట్టుకోని నన్ను జూస్తా... "అనా కాలంగి బస్సేడి కొస్తాది నా," అనింది. అంతే... పక్కన్నించి పక్కుమని నవ్వు. ఈ యమ్మి ఆ పక్కకి దిరుక్కోని మూతికి చెయ్యడ్డం పెట్టుకోని నవ్వతండాది. ఆ యమ్మ గమనించలా...!

"నేన్జూపిస్తా రా కా," అంటా తీస్కెల్లి, బస్సు జూపించేసి నేను తిరిగొచ్చేదాకా నవ్వతానే వుండాది.

అరిత మా చిన్ని కూతురు. చిన్నివోళ్లు అమెరికాలో వుంటారు. నాల్రోజులు మా పక్క పల్లెల్ని చూసి పోవాలని ఈ పిల్ల యిప్పుడిట్టా వొచ్చింది.

*

నెల్నాళ్లప్పుడు చిన్ని ఫోన్జేసింది.

"శ్రీనూ బాగున్నావా," అంది.

సిన్నప్పుడైతే యెంచక్కా 'సీనా' అని పిలిచేది, యిప్పుడంతా కలికాలం. "ఆ బాగుండా చిన్నీ," అన్నా.

"ఏంలేదూ... చిన్న పనిపడి ఫోన్ చేశా."

"చెప్పు... కిచ్చిలికాయ ఊరగాయ బెట్టి పంపించమంటా..." అన్నాను.

ఆవకాయి, నిమ్మకాయీ వోల్లకి అమెరికాలో గూడా దొరకతాయి. కిచ్చిలి కాయే... మన కొంపలో బెడితే తప్ప శానామందికి దొరకదు.

"అదికాదు... మా పెద్దమ్మాయి హరితని కొన్ని రోజులు ఇండియా పంపించాలని అనుకుంటున్నాం..."

"మదరాసూ అయిద్రాబాదూ బొంబాయీ అన్నీ జూపించెయ్యమంటావా..."

"అబ్బెబ్బే అవన్నీ వొద్దూ... తనకి మనవైపు ట్రెడిషన్సూ కల్చరూ అంతగా తెలియట్లేదు. వూర్లో ధర్మరాజుల ఉత్సవాలు జరుగుతాయి కదా..." మాట పూర్తిగాలా...

"అదేందో తిరపతెంకన్న తిరనాలకే పంపక పాయినావా... దిమ్మదిరిగేలా వుంటంది గదా..."

"అంత గ్రాండ్యూర్ ఫెస్టివల్స్ తను చాలా చూసింది. మనవైపు రూరల్ ట్రెడిషన్స్ చూస్తూ, మీ ఊరిలో ఉంటూ..." చిన్ని యేదో చెప్తుండాదిగానీ మల్లీ అడ్డం పడినా.

"యిది పెద్ద ఊరా ఏంది? నిండా నలబై గడపుండదు. సిన్న పల్లి."

"అదే అదే అలాంటి ఊర్లో ఉండి కల్చర్ తెలుసుకుంటుంది అని పంపాలనుకుంటున్నా. మీ యింట్లో వుండడం కుదురుతుందా..." సాగదీస్తోంది. నేను నవ్వేసినా.

"కుదరకపొయ్యేదానికి యేవంత పాటుండాదని? మనమ్మి అమెరికా నుంచి వొచ్చినా కూడు బెట్టబొయ్యేది అరిటాకులోనే! అమ్మి సుకుమార మన్జెప్పి బంగారం గింజలొండి పెట్టబొయ్యేదిలే. యింకేంది కష్టం. యిదిగో పల్నాన్రోజు పాపొస్తుండాది సీనా... అన్జెప్పి పంపిచ్చెయ్యకుండా..." అన్జెప్పినా!

"థాంక్యూ శ్రీనూ... మిమ్మల్ని ఇబ్బంది పెడుతున్నానేమో..." యింకా నసగతాంది.

చిన్ని మాటల్లో శానా శానా మరేద కనిపిస్తుండాది. యిల్లాంటి మరేదలు నేనెప్పటికి నేర్చుకోవాల? నా నోట యింతింతేసి మరేదలు తొంగిసూడక ముందే... నా మాట కొత్త సోకులు దిద్దుకోకముందే... కట్టెను కడ తేర్చెయ్యి సామీ... అని మొక్కుకున్నా లోలోపల.

అదిగో, ఆ మాదిరిగా అరిత మా పల్లి కొచ్చింది. బిడ్డ బంగారం. కొంపలో మా కూడూ కూరలూ యిచ్చగిస్తుండాయో లేదోగానీ... గమ్మున తినేస్తంది. వుద్దిపప్పు వూరిబిండి కాణ్నించి... ఎండు మిరపకాయి యేయించి, పప్పుతో యెనించిన పులుసు దాకా... ఏది నచ్చితే అది అడిగి మరీ పెట్టించుకుంటాది. పొద్దన్నెప్పుడైనా ఉప్పుడుకూడు సద్దిజేసి, చింతపండు, ఎరగడ్డ, ఉప్పుగల్లు, మిరపకాయా చిట్టి రోట్లో నలగేసి పచ్చడి గొడితే... ఓ ముద్ద జాస్తిగా తినేస్తాది. కిచ్చిలికాయ వూరగాయి సంగతి జెబ్బళ్లే. లొట్టలేస్తా సప్పరిస్తాది. పొద్దన్నే పితికేయేళకి యిత్తడిలోటా దీస్కోని కొట్టాంలో కొచ్చేస్తాది. పొదుగు లోంచి నేరుగా లోటాలోకి సుయ్యి సుయ్యిమని పితకాల. బురుగు బురుగ్గా యెచ్చంగా వుండే పచ్చి పాలు లోటాడూ దాగేస్తాది. కాపీగ్గూడా మొండికేసేది లే...!

మా ఊరి పిలకాయిల్తో గూడా బాగా కలిసి పోయింది. ఆడ పిలకాయిలు దొరికితే తొక్కుడుబిల్లా, చెమ్మాచెక్కా... మగ పిలకాయిలు దొరికితే గోలీలూ, బొంగరాలూ, కోడీబిల్లా... వొచ్చినా రాకపోయినా అన్నీ ఆడేస్తండాది. పక్కింటమ్మితో గూడా యీతకు పోతా నంటే... నేను గూడా తోడుండి దిగుడుబాయికి తీస్క పొయ్యినా. ఏదన్నా అయితే మల్లీ చిన్ని కాడ చేతులు గట్టుకోని నిలబడాల. కాకపోతే కొంపలోనే రవంత యిబ్బంది. నా పెండ్లాన్ని పట్టుకోని, 'ఆంటీ కిచెన్‌లో హెల్ప్ చేస్తా,' అంటంది. కత్తిపీట యిస్తే యేలు తెగ తాదేమో, రుబ్బురోటి పస్జెప్తే నలగతాదేమో, సనికెల రాయితో పొత్తరం జారిపైన బడ్తాదేమో, యిసు ర్రాయిని అసలు తిప్పలేందేమో, రోకలిబండిస్తే పోటు కాలిమింద యేసుకుంటాదేమో, పొయికాడికొస్తే యే నూనె రవ్వో యెగిరి పడతాదేమో... అన్నీ బయాలే నాకు. నా పెండ్లాం మామూల్దిగాదు. 'అయ్యన్నీ వద్దు లేమ్మా,' అస్జెప్పి కవ్వం అంటగట్టిందా పిల్లకి. చల్ల చిలికేటప్పుడు కులుకు జూడాల... బలె ముచ్చటే స్తంది. కుండలో కవ్వం పెట్టి చిలికీ చిలికీ... మజ్జిగలో రవ్వంత యెన్న తేరగానే యేలితో యెత్తుకుని నాకేస్తంది.

దరంరాజుల తిరనాల మొదులుకాన్నించీ రోజూ కోవనూరు నుంచీ కాలాస్తి వొస్తాండాం, పోతండాం. కౌరవ పాండవ జెననం, బకాసుర వద, దౌపతమ్మ పెల్లి, దాయాల జూదం, వస్త్రాపరనం, పసుల్ని మలెయ్యడం అన్నీ అయిపొయినాయి. ఇయ్యాల తపసు. రేపు దుర్యోదన దుస్సాసన వద. యెల్లుండి గుండాం.

*

ఆరోజు రాతిరి అన్నాల కాడ అడిగింది అరిత. "అంకుల్... అర్జునుడు చెట్టు ఎక్కాక అలాగ లెమన్ ఫ్రూట్స్, యింకా విభూతి పండ్లు అందరి మీదా పారేశాడు ఎందుకు?"

"అదుష్టం అంటారు తల్లీ," అన్నాన్నేను. "యిబూదిపండు తింటే కొడుకు పుడతాడనీ... నిమ్మకాయి తింటే కూతురు పుడతందనీ నమ్మతాం. అందుకే సుట్టు పక్కల పల్లెల్నించీ యెక్కడెక్కడి గొడ్రా ల్లంతా తపసుమాను కాడికి ఎగబడొస్తారు."

ఆ పిల్ల కల్లు నవ్వతండాయి. "పాపం... అమా యకులైన ప్రజల్ని, స్త్రీలని మోసం చేస్తున్నారు కదా దేవుడి పేరు చెప్తూ. నువ్వు కూడా నమ్ముతావా యివన్నీ? నువ్వు డిగ్రీ కూడా పాసయ్యావని చెప్పిందే మమ్మీ."

ఆ యమ్మి మాటాడతాంటే బలె ముచ్చటగా వుంటాది. వొక్కో మాటనీ కూడ గట్టుకుంటా... అది సరైందోకాదో మనసులో యోచించుకుంటా నెమ్మది గా మాటాడతంది. దొరల బాసలో జెప్పాలంటే, 'ఆర్యూ ఏ ఫూల్ టూ బిలీవ్ దిస్,' అని అడగతాంది. నేన్జెప్పినా...

"నమ్మితే మా నాయిన ముల్లె పోయేదేం లేదుగా తల్లీ. యేం జేద్దాం. ఆచారాలు బుట్టేపాటికి శాస్తరాలు పుట్టకపాయె. కడుపు పండని ఆడది ఆ దుక్కంలో యే అగాయి త్తేనికో తెగబడకుండా యీ నిమ్మకాయ కాసింత ఆశె బుట్టించిందనుకో... అది సాలు గదా! ఆ ఆశెతో రెండేల్లు సాగదీస్తే... ఆలోగా కడుపైనా కాస్తాది... దైర్నమైనా సిక్కబడ్తాది... యింతోటి బతుకులకి ఆ మాత్తరం సాలు గదా...!" కొంచేపు తాళు కుంది.

"యూ మీన్ టూ సే, ఏ స్పార్క్ ఆఫ్ హోప్," ఆలోచన యేడ్నో పెట్టుకోని గాల్లోకి చూస్తా అనిందా పిల్ల. అప్పుడప్పుడూ అంతే... మన బాసలో మాటల్ని పేర్చుకోడం కుదరకుంటే గబుక్కున యింగ్లీసులోకి దూకేస్తాది.

"అట్నే అనుకోరాదామ్మా."

"ఇన్ ఏ వే, అవర్ రిచువల్స్, ట్రెడిషన్స్ ఆర్ లైక్ సైకలాజికల్ ట్రీట్‌మెంట్స్ గివింగ్ హోప్ టూ ది మాసెస్ ఇన్ డిస్ట్రెస్."

'చిన్నీ తరించిపోయింది నా జెనమ,' అనుకున్నా మనసులో వీళ్ల అమ్మను తలుసుకుంటా. ఆచారాలు పండగల గురించి యీ యమ్మికి యిలా అనిపించేట్టు

జెప్తినా... అది చాలు అని బలే కుశాలగా అనిపించింది.


*

మరునాడు దురోదన దుస్సాసన వద కూడా అయిపొయ్యింది. కడాన, యియ్యాలే గుండాం. అగ్గి గుండాం. మద్దేనం కాడికి తీస్కెల్లిపొయ్యినా. ద్రౌపతమ్మ గుల్లోకి బొయ్యి దణ్ణం బెట్టుకున్నాం. అలుగు నిలబెట్టినారు చెయిసాపు కత్తిని. కుండ అంచుమింద మొన ఆనించి! సూదిలాంటి కత్తిమొన మట్టికుండ వంపు మింద ఆనించి నిటారుగా నిలబెడ్తే, మూడుదినాలు పడిపోకుండా అట్నే ఉంటాదది. అరిత చిత్తరంగా చూసింది దాన్ని.

పేరుకి అవి దరంరాజుల తిరనాల్లేగానీ... మొక్కులు పూజలు అన్నీ ద్రౌపతమ్మకే. యీ తిరనాల్లలోకెల్లా అగ్గిగుండానికొచ్చిన జెనం యింకోరోజుండరు. శివరాతిరి మాదిరిగా వుంటాది వూరు. శివరాతిరికి యెక్కడెక్కడ్నించో పెద్దపెద్దోల్లంతా కార్లూ యిమానాల్లో గూడా మా వూరికొస్తాంటారు. కానీ గుండానికి వొచ్చే జెనం యేరే! ఆల్లంతా పక్కాపక్కన పల్లెల్లో వోల్లే. నడుసుకుంటా, బండ్లుగట్టుకోనీ యేద్దారికితే అది పట్టుకోనీ... యెగబడి వొచ్చేస్తారు. దానికి తగ్గట్టుగానే పొరుగూళ్ల నుంచి అంగల్లు గూడా వొచ్చి పడతాయి. అయి పిలకాయిలకి బొమ్మలు, బుడ్డలు గాదు... ఆడోల్లకి చమ్కీబొట్లూ, రంగు పిన్నీసులూ, మెరిసే రిబ్బన్లూ గాదు... మగోల్లకి చలవద్దాలూ, చేతి గడియారాలూ గాదు... నానా అంగళ్లూ వొచ్చేస్తాయి. అడ్డానికీ నిలువుకేగాదు వంకరొంకరగా గూడా తిరిగే రంగులరాట్నాలన్నీ వొస్తాయి. బుడగల్ని కాల్చే తుపాకీలొస్తాయి. సబ్బుల్నీ, డబ్బాల్నీ కొట్టే రింగులొస్తాయి... వొకటేంది రొండేంది... తిరనాల బోగవంతా గుండాంనాడే జూడాల.

చుట్టూ దిరిగి అయ్యన్నీ జూసుకుంటా... కడాకి, గుండాం పక్కకొచ్చి నిలబడ్డాం. యేమైంది.

గుండాం తొక్కేవోళ్లంతా పసుపు గుడ్డలు గట్టుకోని... కోనేట్లో మునిగి, పూల కిరీటాలు బెట్టుకోని, యేపాకు జుట్టుకోని గుంపులుగుంపులుగా వొచ్చి జమవతండారు. వూరువూరంతా సందులేకండా వుండారు జెనం. అవును మరి... దరంరాజుల తిరనాలంటేనే అగ్గిగుండాంనాడే అన్నింటికంటె తొక్కిడి జాస్తి. నాలుగుబారల నేల నాలుగు పచ్చాలుగా గుంటతొవ్వి నిప్పులు బోసినారు. నిప్పులు యెర్రగా కణకణ మండతండాయి. ద్రౌపతమ్మ అగ్గిగుండాం తొక్కినట్టుగా బారతంలో యేడుండాదో మాకు దెలవదు. మా తిరనాల్లలో మాత్తరం అదే ఆచారం. గుండానికి తూరుపు పక్క పూజారొచ్చి నిలబడ్డాడు. పడమరకి- గుడిపక్కగా దిరిగి దణ్ణం బెట్టుకున్నాడు. చేతిలో మల్లెల చెండుండాది. దేవుడికి మొక్కుకుంటూ ఆ మల్లెచెండుని నిప్పుల మీద దొర్లించినాడు. పూలు వాడకుండా యిచ్చుకుంటా అది ఆపక్కదాకా దొర్లుకుంటాబొయ్యింది. దోసిటితో పెరుగన్నం దీసుకోని నిప్పుల మీద జల్లినాడు. మెతుకులు మాడిపోకుండా వుండాయి. గుమ్మడికాయిని దిష్టిదీసి నాలుగు



ముక్కలుగా కోసి... గుండాం నాలుగు మూలలకీ యిసిరేసినాడు. ఒక పట్టుగుడ్డలోకి, మూడు పిడికిళ్లతో మండే నిప్పుల్ని తీసుకోని ఆ గుడ్డని మూటగా కట్టినాడు. దాన్ని కాస్తా పల్లకీలో కూర్చేనుండే ద్రౌపతమ్మ కోక కొంగుకి కట్టినాడు. కొంగులో నిప్పులు యెర్రెర్రగా మండతండాయి.. గుడ్డ కాలడంలే. ద్రౌపతమ్మ పల్లకీని నెత్తికెత్తుకోని... గుండాంలో నిప్పుల్ని తొక్కుకుంటా... పరుగెత్తినాడు! నిప్పుల గుండాం... దాటగానే చిన్న పాలగుండాంలో అడుగులేసుకుంటా... అమ్మని కొలువు దీర్చినాడు. ఆ యెనకాల్నే పెద్దగా పొలికేకలు పెట్టుకుంటా... జెనం గుండాం మీదికి యెగబడినారు. నిప్పులే... కణకణ మండతానే వుండాయి... పిలకాయిలు, ఆడోళ్లు, మగోళ్లు, ముసిలోళ్లు వారాలేం లేకుండా తొక్కుకుంటా వొచ్చేస్తండారు. మా అరిత అలా నోరెల్లబెట్టేసి జూస్తా వుండిపోయింది.

"స్పెక్టాక్యులర్, ఫాబ్యులస్ అంక్.. మామయ్యా. ఇటీజ్ సో స్ప్లెండిడ్... అన్ బిలీవబుల్..." బిడ్డ మురిసిపోతా వుంది. హమ్మయ్య... చిన్ని మనకో పన్జెప్పింది. పరవాలే... దాన్ని సక్కంగానే జేసేసినాం... అనిపించింది.

మొన్నోనాడు చిన్ని ఫోన్జేస్తే జెప్పినా. 'అంతా బానే వుండాదిగానీ చిన్నీ... పాప అంకులాంటీ అంటా వుంటేనే మాకేదో యిరుకిరుగ్గా వుండాది,' అని! కూతురికి ఎట్టా పిలవాల్నో చెప్పినట్టుండాది. అందుకే యిప్పుడిప్పుడే మా యిద్దరినీ యిట్టా పిలస్తాం డాది. అదొక సంబరం... సొంత మడుసుల్తోనే మెసలతండా మనే సంబరం.

ఆ తర్వాతి రోజుకు తిరనాల అయిపోయినాయి.


*

మెలమెల్లగా మా బాస గూడా వొచ్చేస్తండా దాయమ్మికి. అంటే మామూలుగా మాటాడేది గూడా తెలుగే... గానీ, మన తెలుగ్గాదు. అదంతా మడిగట్టుకోని, తిరునామాలు బెట్టుకోని, గందం ముద్దర్లేసుకున్న బాస. మన్దిగాదు. యిప్పుడిప్పుడే కొంచింకొంచింగా మన యిహంలో కొస్తండాది. కాపోతే... మద్దెమద్దెలో మా మాటలు కొన్ని ఆ పిల్లకి తెగ నవ్వు తెప్పించేస్తంటాయి.

ఒక పొరుగింటమ్మ వొస్తాది. నా పెండ్లాం కాడికి బొయ్యి, 'అక్కా రొవ్వంత మజ్జిగచుక్కుంటే యియ్యా... చేవిరికీ..." అని సాగదీస్తాది. మళ్లీ గడప దాటి బయటికొస్తా.. తిన్ని మీద గూసోనుండే నాతో... "అన్నా మా పిలగాడ్ని బళ్లో యెయ్యాల.. రొవ్వంత అయ్యోరితో జెప్తావా..." అంటాది. యీయమ్మి గడపకి ఆ పక్కజేరి కిసుక్కు మంటాది.

యెవుడో తలపండిపోయిన ముసిలోడు వాకిట్లోకి వొస్తాడు. 'సామీ రేపు నార్లు బొయ్యాల దినం బాగుండాదా,' అంటాడు. 'షష్టి నష్టి అంటారు గదా నా.. యెల్లుండి బోస్కోరాదా,' అన్జెప్తా. అదీ నవ్వే.

యింకా సల్లాడాలే యేస్కోడం తెలీని ఒక పిలకాయొస్తాడు. నా పెండ్లాం కాడికి బొయ్యి... 'అకా పొయిలోకి నాలుగు పిడకలు దెమ్మనిందికా... మా యెమ్మ,' అంటాడు.



యియ్యన్నీ మా అరితమ్మకి బలె నవ్వు తెప్పిస్తా ఉండేటివి. పుస్తకాలు జదువు కుంటానో... పక్కింటి పిల్ల దగ్గిర ముగ్గులు నేర్చుకుంటానో... నా పెండ్లాంతో గోరింటాకు పెట్టిచ్చుకుంటానో యీ మాటలిని ముసిముసిగా నవ్వుకునేది.

ఒకనాడు మద్దేనం, వాకిట్లో తాటాకు పందిలి కింద పడక్కుర్సీలో కూచోని యేదో పుస్తకం చదువు కుంటాండా. ఆ యమ్మి పక్కనే గూచోని నా పెండ్లాంతో అచ్చింగాయలు ఆడతా వుంది. అప్పుడడిగింది.

''మామయ్యా.. మమ్మీని నువు పేరుపెట్టి పిలుస్తావు. తాతయ్యని మామయ్యా అంటావు... డేడీని అన్నా అంటావు. ఏంటిది?''

''వరస సరిపోయిండ్లా తల్లీ... మామయ్య అల్లుడు అన్నేగా,'' అంది నా పెండ్లాం అందుకుని.

''మరలాగైతే నేన్నిన్ను పిన్నీ అనీ... మామయ్యను బాబాయ్ అని పిలవాలి కదా.''

''యేవోలే తల్లీ... మాకిట్టా అత్తా మావా అని పించుకోవాలనే వుంటాదెప్పుడూ,'' అంది.

నేను ఆలకిస్తా వుండిపాయినాను.

మర్రోజే అరిత అమెరికా పోక.

*

ఉస్మానుకి ఫోన్జేస్తే బాడుగ కారు దీస్కొనొచ్చి నాడు. యిమానం కాడ్నించి పిల్లని తీస్కొచ్చేటప్పుడు నేనొక్కడ్నే పాయినా. నా పెండ్లాం కూడా వొస్తాననింది యీసారి వొదిలి పెట్టేదానికి, బిడ్డని వొదల్లేక! ఈ పద్దినాల్లో అంత చేరిక అయిపాయె బిడ్డ. అసలే ఆడ బిడ్డల్లేని కొంప. దానికి ముచ్చట తీరలా. అందరం మదరాసు బయల్దేరినాం. కాసింత దూరం బొయి నాక...

''అంతా బాగానే ఉందిగానీ... మీ ఊర్లల్లో పిలుపుల్లో వరసలే నాకు ఎక్కడం లేదు మామయ్యా,'' అంది. నేను బదులియ్యలా. ఆలకిస్తా గూసున్నా.

''నీకంటె పెద్దదైన ఆమె నా బుజం తట్టి అక్కా అంటుంది. పండు ముసలాయన నిన్ను అన్నా అని పిలుస్తాడు. యింకొక లేడీ వస్తుంది... అత్తమ్మను అక్కా అంటుంది, నిన్ను అన్నా అంటుంది. పిలుపుల్లో వరస చెడిపోతోంది. అత్తమ్మ చెల్లికీ నువ్వు అన్నేనా? పిలగాడికీ ముసలోడికీ నువ్వు అన్నేనా?'' నవ్వతాంది.

నేను కూడా నవ్వాను. మద్దెలో అందుకుని, ''మాదంతే వరసలెత్తెలియని గుంపు,'' అంటా... నా పెండ్లామూ నవ్వింది. దానికి బుర్రలో గుజ్జు పలసన. ఎవురేది జెబితే అదే సత్తెం. ఆ యమ్మి మళ్లా మొదులెట్టింది.

''నువు మాత్రం మమ్మీ వాళ్ల నాన్నని మామయ్యా అంటావ్... మమ్మీ అక్కని, అంటే మా పెద్దమ్మని అక్కా అని పిలుస్తావ్... ఏంటిదంతా పద్ధతీ పాడూ లేకుండా... ఒకామెను అక్కా అంటారు... ఆమె భర్తను అన్నా అనేస్తారు... ఓ బుడ్డోడు వచ్చి ఆంటీని 'అకా' అని పిలస్తాడు. పిచ్చిగా లేదూ ఇది.''

యీ మాటల్ని ఆ పిల్ల చానారోజుల్నించి దాసి పెట్టుకోని... యిప్పుడు బయట పెట్టిందని తెలిసి పోతండాది. బదులియ్యకుండా వుండిపాయినా. నా పెండ్లాం యిక యిక నవ్వతానే వుండాది.

''ఎవర్ యూ హేడ్ ఏ థాట్ ఆఫ్ ఇట్. యాజ్... ఇటీజ్ రిడిక్యూలస్,'' ముల్లులా గుచ్చుకుంటండాది మాట.

ఉస్మాను టీ తాగాలని కారాపినాడు. మాకం దరికీ కార్లోకి సమోసాలు, టీ తెచ్చిచ్చినాడు. తిన్నాం. తాగాం. కారు మళ్లీ బయల్దేరింది. ఆయమ్మి యింకేమీ జెప్పేట్టు లే. నే మొదులెట్టినా...

''అరితమ్మా... అప్పుడెప్పుడో యివేకానంద సామి మీ వూరొచ్చి...'' నా కడ్డం పడింది.

''ఆయనొచ్చింది చికాగో, మాది టెక్సాస్...''

''యేదో వొక సత్రకాయ వూర్లే. అమెరికానే గదా! ఆడికొచ్చి, బెదర్స్ ఎండ్ సిస్టర్స్ ఆఫ్ అమెరికా అనం గానే... మీవోళ్లకంతా... అదేలే... అమెరికావోళ్లకి చిత్తరంగా అనిపించింది గదా...''

''అంతేగా మామయ్యా... అక్కడంతా లేడీస్ అండ్ జెంటిల్మెన్ అనేదే పద్ధతి గదా...''

"మీవోళ్లకి అది యిచిత్తరవేగానీ... మాకు యిచిత్రం అనిపించలేదమ్మా...! అన్నదమ్ముళ్లారా అప్పజెల్లెళ్లారా అనంటే యీ యెర్రోళ్లు అంతగా ఆచ్చెరపోయేది యేముండాదబ్బా అనుకున్నాం మేం. యెందుకంటే... మాకు యే ఆడది గనిపించినా అది అప్పజెల్లే... యే మగోడు గనిపించినా అన్నదమ్ముడే... మా యెదవ బుర్రకి యింకోరకంగా జూడ్డం తెల్దమ్మా... అందుకే అట్నే పిలస్తంటాం... పద్దతీపాడూ లేకండా...! బస్టాండ్‌లో యాబయ్యేళ్ల ఆడదానికి యే బస్సెక్కాలో తెలవకపోతే... ఇరయ్యేళ్ల పిలగాణ్ని 'అన్నా' అని పిలిచి అడగతంది. దాన్నేదో అంటారమ్మా... పెపంచికమంతా తోబుట్టులే అనడానికి... అదేందో తట్టడం లేదే..."

"యూనివర్సల్ బ్రదర్‌హుడ్..." గబుక్కున అందించింది, జాగర్తగా యింటన్నట్టు.

"అట్టాంటిదే... దాన్ని మన బాసలో గూడా యేదో..."

"విశ్వమానవ సౌ... సౌభ్రా...త్రం..."

"బంగారుతల్లివమ్మా నువ్వు... మా పిలకాయిలకి నోరు దిరగనివి గూడా నేర్పినావు. యెంత బాగ జెప్పినావో... అదేనమ్మా అదే. పేరు తెలవకపాయినా, మా కందరికీ వుండేది అదే. మా మాటకి, మా బాసకి వరసుందో లేదో నాకు తెల్దమ్మా... కానీ మనసుంటాది... అది నిన్ను అక్కగానో సెల్లిగానో మాత్తరమే జూస్తాది... రేపు నీకు పెండ్లయ్యి పెనిమిటి వొస్తే వోణ్ని అన్నగానో తమ్ముడిగానో మాత్తరమే జూస్తాది... మీ నాయిన్ని నేను అన్నా అని పిలిసినా... మీ పెద్దమ్మని అక్కా అని పిలిసినా... అందుకే. కొన్ని జెనమలంతే తల్లీ... అట్టాగే యెలబారిపోతంటాయి..."

కొంచి ఆగినా. జవాబు రాలా.

"మా బాస అర్జునుడి తపసుమాను మాదిర్ది తల్లీ... అది, అర్జునుడు జోలినిండా దెచ్చిన వాటితో గొడ్రాళ్లకి కొడుకుల్నీ కూతుర్లనీ యిస్తాది. అట్టాగ, బతుకు మింద ఆశ పుట్టిస్తాది. మా బాస, అడుగడుక్కీ కొత్త అప్పజెల్లెళ్లనీ అన్నదమ్ముళ్లనీ యిస్తాది... యిట్టాగ, బందాల్ని ముడి పెట్టేస్తాది..."

నేను ముందర సీట్లో గూసోనుండాను. యెనకల సద్దులేదు. ఆ యమ్మి క్కోపమొచ్చిందా? వొచ్చినా తప్పులేదు... అట్టాగని నేన్జెప్పటమూ తప్పుగాదు. తెలుసుకోడానికి అళ్లమ్మ అమెరికా నుంచి యీడికి అంపిస్తే... తెలియజెప్పకుండానే తిప్పంపిస్తే యెట్టా? నాకు నేను సరిది జెప్పుకున్నాను.

యీలోగా యిమానాశ్రయమొచ్చింది. ఆ పెపంచికంలో, గందరగోలంలో పడిపోయినాం. సంచులన్నీ దించి చక్రాలబండిమీద బెట్టుకున్నాది. పోటమే మిగిలిందింక... ఆ పిల్ల లోపలకీ... మేం బైటికీ...

బిడ్డ యెల్లిపోతాందంటే... నాకు యేదోగా వుండాది. ముచ్చుగా ఉండిపాయినా. నా పెండ్లానికి కండ్లల్లో నీళ్లూరతండాయి. బిడ్డని దగ్గిరికి దీస్కోని నుదట్న ముద్దు పెట్టుకునింది. చీర కొంగుతో కళ్లొత్తుకునింది. యేళ మీరిపోతండాది.

ఆ యమ్మి నా దగ్గరకొచ్చి... 'యింక పొయ్యొస్తా,' అన్నట్టుగా చెయ్యిగలిపింది.

నేను రెండు చేతుల్తో పట్టుకున్నా... మాటల్ని కూడగట్టుకోని...

"మళ్లీ రావాల తల్లీ," అన్నా.

ముచ్చటగా నవ్వింది. "యేం మావా... అంత తేలిగ్గా యిడిసిపెడతాననుకున్నా... మళ్లీ వొస్తా... మీ వూళ్లో ముసిలక్కల్నీ పడుసన్నల్నీ అందర్నీ సిక్కుదీసి సక్కబెడ్తా... అత్తా... యేడు గంగల జాతరేళకి మళ్లీ వొస్తా. అప్పటిదాకా మావ జాగర్త."

అంకుల్ పాయె... మామయ్య పాయె... యిప్పుడు మావొచ్చింది. సెవుల్లో పండగ పండగ్గా వుండాది. ఆ యమ్మి మాటలింటా వుంటే లోపల కులుకు నిలవడం లే. మురిసిపోతా వుండా. దూరంగా యిమానానికేసి పోతా... ఆ పిల్ల యెనక్కి తిరిగి నవ్వతా వుంటే... నా పెండ్లాం... రెండు సేతులూ గాల్లో తిప్పి, యేళ్లు మడిచి కణతల కేసి గెణుపులు నొక్కుకునింది. పటపట మెటికలు యిరిగినాయి.

*తెలుగు వెలుగు మాసపత్రిక*
*డిసెంబర్ 2019*






*Commercial complex leased to an Educational Institution located at MG Road is For Sale.*

*The complex contains 43,000 square feet on three floors. The monthly rent is $350,000.00 rs which will be increasing next year."The tenant will vacate in one year if desired. The property includes two acres of land with adequate parking and in a prestigious upcoming neighborhood. "The offering price is $15 million USA dollars. We will provide a mortgage to the qualified buyer with 30% down. The real estate taxes are $61,000.00 rs."The property was built in 1996 and in excellent condition."*

*"Interested parties please contact:*


**PRASAD MEDEPALLI**

(201) 364-7551. or email me at: vasanta07@gmail.com

# సినిమాపాటకి కంఠాభరణం

సాయిబ్రహ్మానందం గొర్తి

*"బీతోవెన్ మళ్లా పుట్టాడా...? మొజార్ట్ మళ్లీ పుట్టేడా...?
ఎక్కడో దూరంగానున్న ఆళ్ల గురించొద్దుగానీ ద గ్రేట్ ఘంటసాల మళ్లీ పుట్టారా...?
వీరిలో ఎవరైనా పుట్టొచ్చు గానీ...శ్రీపతి పండితారాధ్యుల బాల సుబ్రహ్మణ్యం ఇహ మళ్లీ పుట్టడం జరగదు."
ఎందుకంటే - అసలాయన పోతే గదా పుట్టడానికి...?*



**కొందరి మరణాలు నమ్మబుద్ధి కాదు.
అందుకే వారు గొప్పవారు.
పైన చెప్పినవి నా మాటలు కావు, ఒక్క చివరి రెండు వాక్యాలు తప్పించి.
సినిమా దర్శకుడు వంశీ, బాల సుబ్రహ్మణ్యం గురించి చెబుతూ, ఇహ లేరన్న తన బాధని దిగమింగుకుంటూ, పొలమారిన జ్ఞాపకాలు పుస్తకంలో రాసినవి.**

దక్షిణాదిన, ముఖ్యంగా తెలుగువారికి పరిచయం చెయ్యనవసరం లేని పేరు. గత అయిదు దశాబ్దాలుగా ప్రతీ కుటుంబాన్నీ అలరించిన గళం.

వయసుతో నిమిత్తం లేకుండా అందరూ అభిమానించిన పాటగాడు బాలు. బాలూ పాటని కూనిరాగం తీయని వ్యక్తి ఒక్కరు కూడా ఉండరు అంటే అది అతిశయోక్తి కాదు.

శంకరాభరణం చిత్రాన్ని కంఠాభరణంగా ధరించి యావత్తు భారతదేశానికి తెలుగు పాట గొప్పదనాన్ని అందించిన తెలుగువాడు.

*

నా చిన్నతనమంతా బాలసుబ్రహ్మణ్యం పాటలతోనే గడిచింది. బాలూ పాటతో పాటే పెరిగాను కాబట్టి ఆయన పాటంటే గౌరవం వుంది.

అప్పుడప్పుడు కొన్ని పాటలలు తిట్టుకున్నా, వినీ విననట్లు దాటేసుకుంటూ, ఒక మంచి పాట చెవిన పడగానే అంతే ఇష్టంగా తలచుకున్నవీ వున్నాయి.

వయసు పెరిగేకొద్దీ బాలూ పాటలంటే ఇష్టం తగ్గినా అభిమానం మాత్రం తగ్గలేదు. తిట్టుకున్న పాటలు వరస (ట్యూన్) బాగోలేక తప్ప బాలూ పాడడం వలన కానేకాదు.

సంగీతంలో నాకున్న కొద్దిపాటి అవగాహనా, బాలూ మీద అభిమానమే ఈ పరామర్శ.

వెరశి - ఒక చిన్న జ్ఞాపకాల దొంతర.

*

దాదాపు పదేళ్ల క్రిందటి సంగతి.

ప్రముఖ విద్వాంసుడు బాలమురళీకృష్ణగారితో కొన్ని గంటలు గడిపే అవకాశం వచ్చింది. ఆ సందర్భంగా నేనొక వీడియో ఇంటర్వ్యూ చేసాను. దురదృష్ట వశాత్తూ ఆ వీడియో నా కళ్ల ముందే చెరిపివేయబడింది.

ఆ ఇంటర్వ్యూలో, 'మీరూ సినిమా పాటలు పాడారు కదా? మీకు నచ్చిన లేదా మెచ్చిన తెలుగు సినిమా గాయకులెవరు?' అని అడిగాను.

నన్ను ఆశ్చర్యపరుస్తూ, 'బాల సుబ్రహ్మణ్యం' పేరు చెప్పారు. నిజానికి నేను ఆశించిన జవాబు- ఘంటసాల లేదా పి.బి. శ్రీనివాస్, సంగీతం వచ్చిన జేసుదాస్!

నా రియాక్షన్ గమనించి, 'సాధన చేసి బాల సుబ్రహ్మణ్యం నాలాగ పాడగలడు; కానీ నేను అతనిలా పాడలేను. యుగళగీతాలకి కావల్సిన జోరూ, హుషారూ నా గొంతులో పలికించాలని ప్రయత్నం చేసినా రాదు,' అన్నారు.

ఆయన జవాబు ఒప్పలేదు నాకు.

'మీరూ యుగళగీతాలు పాడారు కదా...? వసంత గాలికి వలపులు రేగా పాట యుగళగీతమే కదా?' అని ఎదురు ప్రశ్న వేసాను.

'అది యుగళగీతమే. కానీ ఇద్దరు సంస్కారవంతులైన ప్రేమికుల సరసంలా ఉంటుందా పాట. అందరి గొంతులూ అన్నిటికీ నప్పవు. అంతెందుకూ- ఘంటసాల కూడా చివర్లో చెంగావిరంగు చీరా- అంటూ పాడారు. వినడం వరకూ బాగానే ఉంటాయి. పాట చెవిలో కాదు; నాలుక మీద నర్తించాలి. మనసు



చేత పాడించాలి,' అనేసరికి మౌనంగా ఉండిపోయాను.

'అతను పాడిన- మబ్బే మసకేసిందిలే... లాంటి పాట నేను అంత హుషారుగా పాడలేను. అది తమిళంలోనూ ఉంది. అంత గొప్పగా అనిపించదు. తెలుగులో బాలు పాడిన పాట భలే బావుంటుంది...' అని చెప్పారు.

'సినిమాపాటలు పక్కన పెట్టండి. క్లాసికల్ సంగీతం పాడి బాలు మెప్పించారని అనుకోను...' అని అంటే గూగుల్ చెయ్యమని ఒక కన్నడ పాట చెప్పారు.

అది అక్కడే విన్నాం- నాకు బాలు పాడాడంటే నమ్మబుద్ధి కాలేదు.

'ఉమండ్ ఘుమండ్ ఘన ఘర్ జే బదరా' అనే పాట. 'సంగీత సాగర గానయోగి పంచాక్షర గవై' (1995) అనే కన్నడ సినిమాలోది. పాట వినగానే భీమ్ సేన్ జోషీ వయసులో ఉండగా పాడినట్లనిపించింది. తాన్‌సేన్ స్వరపరిచిన పాటకి, సినిమాలో హంసలేఖ సంగీతం కూర్చారు.

ఆ పాటకి బాలూకి 1995లో బెస్ట్ సింగర్ అవార్డు వచ్చింది. ఆ పాట వింటే ఏ హిందూస్తానీ విద్వాంసుడో పాడేరని అనుకుంటాం. అవకాశమొస్తే తానూ శాస్త్రీయ సంగీతం పాడగలడూ, మెప్పించగలడూ అని నిరూపించిన పాట.

*


సినిమా పాటకి ఒక బాణీనీ, ఒరవడినీ తెచ్చింది ఘంటసాల గాత్రం. ప్రజల నోళ్లల్లో నానేట్లుగా సినిమా పాటకి ప్రాచుర్యం తెచ్చిన వారిలో ఘంటసాల ప్రముఖుడు.

ఆయనకి ముందు నాగయ్య, ఎం.ఎస్. రామారావు ఇంకా ఎంతోమంది పాడినా ప్రజల దగ్గరకి సినిమాపాటని తీసుకెళ్లింది ఘంటసాల. ముఖ్యంగా పద్యాలు. రాగయుక్తంగా పద్యాలు పాడుకోవచ్చు అనేట్లా పద్యాలు పాడి ఒక సరికొత్త బాణీని అందించారు. బాలు సినిమారంగానికొచ్చేసరికే ఘంటసాల గాయకుడిగా, సంగీత దర్శకుడిగా పేరున్న వ్యక్తి.

ఒకసారి 1964లో, మద్రాసులో (ఇప్పటి చెన్నై) ఒక తెలుగు కల్చరల్ అసోసియేషన్ పాటల పోటీ నిర్వహించారు. ఆ పోటీకి జడ్జీలుగా వున్నది సంగీత దర్శకుడు కోదండపాణి, గాయకుడు ఘంటసాల. అప్పటికే ఘంటసాల సంగీత దర్శకుడిగా ఎన్నో సినిమాలు చేసారు. ఆ పాటల పోటీలో బాలూకి మొదటి బహుమతి వచ్చింది. ఆ విధంగా కోదండపాణి దృష్టిలో పడ్డాడు బాలూ.

సినిమాల్లో పాడటానికి అవకాశాలకోసం అన్ని స్టూడియోలూ కాళ్లరిగేలా తిరిగితే, చివరకి ఒక పాటకి అవకాశం వచ్చింది. అదీ పి.బి. శ్రీనివాస్ తమిళ చిత్రానికి ట్రాక్ సింగర్‌గా.

ఆ తరువాత *శ్రీశ్రీశ్రీ మర్యాదరామన్న* చిత్రంలో పూర్తిగా పాడటానికి అవకాశమిచ్చింది సంగీత దర్శకుడు కోదండపాణి.



అది సుశీల, బాలూ కలిసి పాడిన 'అహో ఏమి ఈ వింత మోహం...' అన్న యుగళ గీతం. రెండో పాటకి ఒక కన్నడ సినిమాలో అవకాశం వచ్చింది.

కొన్ని కారణాల వలన మర్యాదరామన్న చిత్రం విడుదలకి ఏడాది పైనే పట్టింది. ఈ మధ్యలో *కాల చక్రం* అనే సినిమాలో పాట పాడాడు. దీనికి సంగీతం కూర్చింది ఎం.ఎస్. వైద్యనాథన్. మర్యాదరామన్న, కాలచక్రం ఒక్క నెల తేడాలోనే విడుదలయ్యాయి.

ఆ తరువాత ఒకటీ, అరా పాటలు పాడినా బాగా గుర్తింపు వచ్చింది, *ఏకవీర* చిత్రంలో- 'ప్రతీ రాత్రి వసంత రాత్రి...' పాట. ఘంటసాలతో కలిసి పాడాడు. ఇంకా 'ఏ పారిజాతములియ్యగలను సఖీ...' అనే పద్యం కూడా పాడాడు.

ఇదే చిత్రంలో- 'ఎంత దూరమూ, అది ఎంత దూరమూ...' అనే విషాద గీతాన్ని సుశీలతో కలిసి పాడాడు. చిత్రం ఏవిటంటే, ఎన్టీ రామారావుకి బాలూ పాడిన మొదటి పాట కూడా ఇదే.

సోలోగా ఒక సినిమాలో అన్ని పాటలూ పాడిన సినిమా *జాతకరత్న మిడతంభొట్లు*. ఈ సినిమా హాస్యనటుడు పద్మనాభం నటించి, నిర్మించింది. ఈ సినిమాలో 'దయ చూడవే గాడిదా...' అని హిందోళ రాగంలో ఒక పాటుంటుంది. అందులో లేత గొంతుకతో బాలూ సంగతులు కూడా వేస్తూ పాడుతాడు. హాస్యం తీరున నడిచే పాట వలన అది అంతగా ఎవరికీ ఎక్కలేదు.

ఆ తరువాత 1970లో వచ్చిన *సంబరాల రాంబాబు* సినిమాలో 'మామా, చందమామా...' పాట బాగా హిట్ అయ్యింది. సుశీల కూడా ఇదే పాట పాడినా, బాలూకే మంచి పేరొచ్చింది. నిజానికి బాలూ పాట బదులు వేరే ఇంకో పాట అనుకున్నారట. సుశీల పాట రికార్డింగ్‌లో విని ఆ పాటే పెట్టమని బాలూ అడిగితే ఆయన కోరికమీద పెట్టారనీ చదివాను.

ఎన్.టి. రామారావు నటించిన *శ్రీకృష్ణ సత్య* సినిమాలో కూడా బాలూ ఘంటసాల పాటలున్నాయి. అందులో బాలూ 'చందన చర్చిత నీల కళేబర...'

జయదేవాష్టపది పాడాడు. *కథానాయిక మొల్ల* సినిమాలో కూడా ఘంటసాల, బాలూ పాడారు. బాలూ పాడిన, 'మనిషిని బ్రహ్మయ్య మట్టితో చేసెనయా...', పాట మంచి ప్రాచుర్యం పొందిన పాట.

ఘంటసాల సంగీత దర్శకత్వంలో ఆలీబాబా నలభై దొంగలు సినిమాలో ఒక పాట పాడాడు బాలు. రామరాజ్యం సినిమాలో, 'ఏమండి లేత బుగ్గల లాయరుగారు...' పాట కూడా ఘంటసాల దర్శకత్వం లోదే. ఘంటసాల సంగీతంలో పాడిన మరో మంచి పాట 'సెలయేటి గలగల, చిరుగాలి కిలకిల...' ఈ పాట ఘంటసాల సంగీతం చేసిన చివరి సినిమా తులసిలోనిది.

ఇవన్నీ 1973కి ముందు వచ్చిన సినిమాలు. ఆ తరువాత సంవత్సరం 1974లో ఘంటసాల పోయారు.

అలా ఆయన శకానికి తెరపడింది. బాలూ శకం మొదలయ్యింది.

*

దాదాపు 1975 వరకూ బాలూ సినీ సంగీత ప్రయాణమేమీ అంత సాఫీగా లేదు. రామకృష్ణ గొంతు ఘంటసాలకి దగ్గరగా వుందనీ, చాలా సినిమాల్లో ఆయనచేతే పాడించారు.

బాలూ పాటలకి విపరీతమైన క్రేజ్ తీసుకొచ్చిన సినిమా అడవిరాముడు. ఆ సినిమాలో ఎన్.టీ.ఆర్‌కి, ఆలుమగలు సినిమాలో నాగేశ్వర్రావుకీ పాడటంతో ప్రేక్షకులూ బావుందిలే అనుకున్నారు. అంతవరకూ కృష్ణ, శోభన్‌బాబులకి పరిమితమైన బాలూ, మిగతా పెద్ద హీరోలకీ పాడటం మొదలయ్యింది.

ఆ వరసలోనే బాలూకి చాలా పెద్ద పేరు తీసుకొచ్చిన సినిమా- సిరిసిరిమువ్వ. అంతకుముందు చెల్లెలి కాపురంలో 'చరణ కింకిణులు...' అనే హిట్ సాంగ్ పాడినా, ఈ చిత్రంతో కె. విశ్వనాథ్ సినిమాలకి బాలూ ఆస్థాన గాయకుడిగా మారిపోయాడు. సరిగ్గా అప్పుడే వచ్చిన సోగ్గాడు, వెనువెంటనే రిలీజ్ అయిన సీతామాలక్ష్మి బాలూ పాటలకి ఒక స్థాయినీ, పాపులారిటీనీ తీసుకొచ్చాయి.

ఆ క్రమంలోనే బాలూ పాటకి లభించిన కంఠాభరణంలాంటి సినిమా *శంకరాభరణం.*



అంతవరకూ, శాస్త్రీయ సంగీతపరంగా వచ్చిన పాటలు పాడలేడన్న అపప్రథ కాస్తా తుడిచిపెట్టుకుపోయి, బాలూ పాటకి తిరుగులేకుండా పోయింది.

*

చాలామంది పాటలు పాడుతారు. పాటకి శృతి, లయ రెండూ ముఖ్యం. ఇవి కాకుండా ప్రతీ గాయకులకీ ఉండాల్సిన లక్షణం 'మాధుర్యం'గా పాడడం.

ఇక్కడ మాధుర్యం అంటే కేవలం గొంతు మాత్రమే కాదు. పాట పాడే పద్ధతి. ఏ పాటైనా ఒక తాళానికనువుగా లయ వుంటుంది. ఏదో ఒక రాగం లేదా రెండు, మూడు రాగాలు కలిపి ఒక పాటకి వరస కట్టచ్చు. ప్రతీ రాగానికి కొన్ని రాగ లక్షణాలుంటాయి. స్వరాల పొందిక, గమకాలు ఉంటాయి.

మనందరి చెవినీ చేరేది సాహిత్యమే అయినా దాని వెనకుండేది స్వరవిన్యాసమే. పాట వరసని (ట్యూన్ని) బట్టి గమకాలుంటాయి.

వాటిని నిర్దిష్ట కాలంలో లయ చెడకుండా, శృతి తప్పకుండా పాడగలిగితే వినడానికి సొంపుగా వుంటుంది. రెండు స్వరాల స్థానంలో నాలుగూ లేదా ఆరు స్వరాలు పలికించడం, అదీ లయ తప్పకుండా పాడటం అంత తేలిక వ్యవహారం కాదు. ఒక్కోసారి ఏకధాటిన పాడుతూ ఊపిరి తీసుకోడానిక్కూడా అందదు.



గొప్ప గాయకులు పాడేటప్పుడు ఈ సూత్రాలన్నీ ఖచ్చితంగా పాటిస్తారు. కాబట్టే వారి పాటలు విన సొంపుగా వుంటాయి.

ఒక త్యాగరాజ కృతి మామూలు గాయకులు పాడేపాటకీ, మాధుర్యంతో బాలమురళీకృష్ణ లాంటి వారు పాడిన దానినీ మన చెవులు ఇట్టే పసిగట్టేస్తాయి. ఏవిటి తేడా అని చెప్పలేకపోవచ్చు గానీ, వినసొంపుగా ఉంటుంది. మరలా మరలా వినాలనిపిస్తుంది.

తమపాటని ఇంకో మెట్టు పైకి తీసుకెళ్లాలంటే గాయకులు చాలా కృషి చెయ్యాలి. దోషరాహిత్యంగా పరిపక్వతతో పాడగలగాలి.

బాలూ వచ్చిన కాలంలోనే, రామకృష్ణ, జి. ఆనంద్ ఇలా కొంతమంది కొత్త గాయకులు వచ్చి సినిమాల్లో పాడారు. రామకృష్ణకి అనునాసిక స్వరాలు (Nasal Touch) వినిపిస్తాయి. జి. ఆనంద్‌కీ ఈ సమస్య ఉంది. వీరు పాడిన పాటలు ఒక శృతిలో పాడితే బావుంటాయి. ఏ మాత్రం శృతి స్థాయి పెరిగినా మాధుర్యం కోల్పోతాయి.

బాలూకి ఈ సమస్య లేదు. గొంతు బొంగురు పోవడం, ముక్కుతో పాడటం వంటివి లేకపోవడం గొప్ప వరం. బాలూకున్న ఒక ప్రత్యేకత ఏవిటంటే, పాట పాడుతూంటే ప్రతీ అక్షరం స్పష్టంగా వినిపిస్తుంది. పాడేటప్పుడు అక్షరాలు మింగేయడం లేదా దాటు వేయడం కనిపించదు.

అందుకే అప్రతిహతంగా పాడగలిగాడు.

*

సినిమా పాట పాడడం తేలిగ్గా తేసేసే వ్యవహారం కాదు. శాస్త్రీయ సంగీతం పాడేవారు సినిమా పాటంటే కాస్త చులకనగా చూస్తారని తెలుసున్నదే.

శాస్త్రీయ సంగీత కచేరీలు సాధారణంగా ఒక వర్ణమూ, రెండు మూడు త్యాగరాజు, దీక్షితార్ కృతులూ, ఇలాంటి కీర్తనలతోనే వుంటాయి.

వీటిని సాహిత్యంతోనే పాడినా రాగామూ, స్వరమూ అన్నీ నిర్దిష్టంగా వుంటాయి. కొంతమంది చరణాల దగ్గర ఆ సదరు రాగంలోనే స్వరకల్పన చేసి పాడతారు. ఒక్కోసారి కీర్తన ఎత్తుకోవడమే ఆలాపనతో మొదలవుతాయి. ఇక్కడ ఆలాపనా, స్వరకల్పనలు విద్వాంసులు వారి పాండిత్యం చూపిస్తూ పాడతారు. ఆ రకంగా గాయకుల ప్రతిభ శ్రోతలకి తెలుస్తుంది.

కానీ సినిమాపాటకి చాలా నిబంధనలుంటాయి. ముందుగా పాట ఒక సన్నివేశానికి రాయబడుతుంది. ఆ సన్నివేశంలో సందర్భానికీ, భావానికీ అనుగుణంగా రచయితలు పాటలు రాస్తారు. తరువాత పాటకి వరస (ట్యూన్) కడతారు. చాలాసార్లు ట్యూన్‌కే రాయబడతాయి కూడా. పలానా రాగమే ఉండాలన్న నియమంలేదు కాబట్టి, ఒక్కోసారి రెండు మూడు రాగాలు కలగాపులగం చేస్తూ వరసలు కడతారు.

సినిమాల్లో గాయకులకి పాట ఇవ్వగానే సాధన చెయ్యాలి. పాడేటప్పుడు ఆ పాత్రల భావావేశనికనుగుణంగా గొంతులో పలికించాలి. పాటలో ఉండే గమకాలూ, విరుపులూ ఇవీ పట్టించుకోవాలి. ఇదంతా ఒక రెండు మూడు గంటల్లో అయిపోతుంది. ఎందుకంటే సంగీత దర్శకుడు వాయిద్యకారులకి (ఆర్కెస్ట్రా) ఏ ఏ స్వరాలు వాయించాలో (Arrangement) ముందుగానే చెబుతారు. సోలో పాటలయితే ఒకరితోనే వుంటుంది. యుగళగీతాలయితే ఇద్దరు గాయనీ, గాయకులు సాధన చేసి పాడుతారు.

మిగతా గాయకులతో పోలిస్తే బాలూ పాట వరస ఇట్టే పట్టేస్తాడు. గ్రహణశక్తి కూడా చాలా ఎక్కువ. సంగీత దర్శకుడు చెప్పినట్లు అచ్చుగుద్దినట్లు అతి తక్కువ సమయంలో పాడేస్తాడు.

పైగా ఒకేరోజు అయిదు పాటలు పాడితే రికార్డింగ్ స్టూడియో ఖర్చూ, ఇవన్నీ కూడా కలిసొస్తాయి. ఈ రకంగా వారికి కాలమూ, ఖర్చూ రెండూ తగ్గించేవాడు బాలూ. కన్నడంలో ఒక సినిమాకి ఒకే రోజులో 14 పాటలు పాడి రికార్డు చేయించాడు. వినడానికి సంఖ్య బాగానే అనిపించినా, 14 పాటలు రికార్డింగ్ ఆషామాషీ వ్యవహారం కాదు.

అందుకే సంగీతదర్శకులూ, నిర్మాతలూ బాలూ చేత పాడించడానికే మొగ్గు చూపేవారు.

తూర్పు-పడమర అనే ఒక సినిమా వచ్చింది డెబ్భైల్లో. 'శివరంజని నవరాగిణి...' పాటని కేవలం రెండు గంటల వ్యవధిలో బాలూ పాడినట్లు ఒక ఇంటర్వ్యూలో సంగీత దర్శకుడు రమేష్ నాయుడు అన్నారు. ఆ పాట సూపర్ హిట్ అయ్యి బాలూకి ఎంతో పేరు తెచ్చింది.

ఈ పాటకంటే ముందు ప్రతీకారం (1969) అనే సినిమాలో 'నారీ రసమాధురీ...' పాట పూర్తి శాస్త్రీయ సంగీత బాణీలో సత్యం స్వర పరిస్తే బాలూ పాడాడు. కానీ ఆ పాట ఇప్పుడు ఎక్కడా లభ్యం కావటంలేదు.

శంకరాభరణం చిత్రంలో 'శంకరా నాదశరీరా పరా...' పాట పెద్ద హిట్ అయినా, 'రాగం తానం పల్లవి...' పాట గమకాలూ, విరుపులతో సశాస్త్రీయంగా పాడాడు బాలూ. అలాగే 'దొరకునా ఇటువంటి సేవ...' పాటలో శంకరశాస్త్రి పాత్రలో దూరి బాలూ పాడాడా అన్నట్లుగా పాడాడు.

అలాంటిదే సాగర సంగమంలో పాడిన 'నాద వినోదము...' పాట కూడా. సీతారామయ్యగారి మనవరాలు చిత్రంలో 'సమయానికి తగు పాట పాడెనే...', సప్తపదిలో 'అఖిలాండేశ్వరీ...' (ఇది సుశీలతో కలిసి పాడారు), ఆనందభైరవి చిత్రంలో 'బ్రహ్మాంజలీ...', స్వాతికిరణం సినిమాలో 'శివానీ, భవానీ...', ఓ పాపా లాలి సినిమాలో 'మాటే రాని చిన్నదాని ఊసులూ...' - ఇలాంటివన్నీ సశాస్త్రీయంగా పాడిన పాటలు. 'పిబరే రామరసం...' పడమటి సంధ్యా రాగం సినిమాలో చెల్లెలు శైలజతో కలిసి బాలూ పాడిన మరొక మంచి పాట.

ఇంకా పెద్ద పట్టీ ఇవ్వచ్చుగానీ, ఇవన్నీ బాలూ ప్రతిభకి మచ్చుతునకలు. ముఖ్యంగా శాస్త్రీయ సంగీతం ఆధారంగా కూర్చిన పాటలు. జాగ్రత్తగా వింటే అన్ని పాటల్లో గమకాలు స్పష్టంగా తెలుస్తాయి.

"పాడటం దైవదత్తం. అది సాధనతో ద్విగుణీకృతమవుతుంది. ఇన్నేసి తర్ఫీదులు అవసరంలేదు. సంగీతాన్ని అవలోకనం చేసుకోపోతే ఏ పాటైనా పాడచ్చు. బాలు దీనికి పెద్ద ఉదాహరణ."

ఒక బాల విద్వాంసుడు మరో బాలూకిచ్చిన కితాబు. మొదటి బాల విద్వాంసుడు- బాలమురళీ కృష్ణ. రెండో ఆయన మనందరికీ సుపరిచితులే.

*

బాలూకి ఉన్న మరో పెద్ద టాలెంటు- మిమిక్రీ. ఇది సినిమా పాటలకి బాగా ఉపయోగపడింది. రాజబాబుకీ పాడగలడు. అల్లు రామలింగయ్యకీ పాడగలడు. మాడాకీ గొంతు సవరించుకోగలడు.

ముగ్గరమ్మాయిలు సినిమాలో 'ఆకాశం నుండి నాకోసం వచ్చావా?' పాట రాజబాబుపై చిత్రకరించారు. బయట వింటే అచ్చు రాజబాబు గొంతులో విన్నట్లే వుంటుంది.

అలాగే అంతులేని కథ సినిమాలో 'తాళికట్టు శుభవేళ...' పాటలో పక్షుల కూతలూ, విమానం ఎగిరే ధ్వనీ- మిమిక్రీ చేసాడు.



'సూడు పిన్నమ్మా పాడు పిల్లడు...' అంటూ చిల్లరకొట్టు చిట్టెమ్మ చిత్రంలో మాడా వెంకటేశ్వరరావు పాడినట్లు అచ్చు గుద్దేసాడు బాలూ.

ఇది *కథకాదు* సినిమాలో 'అటు ఇటు కానీ హృదయంతోటీ ఎందుకురా ఈ తొందర నీకు...' పాట కమలహాసన్ పాడినట్లే అనిపిస్తుంది.

'ముత్యాలూ వస్తావా? అడిగింది ఇస్తావా?'- అచ్చు అల్లు రామలింగయ్య గొంతుని దింపేస్తూ పాడాడు బాలూ- *మనుషులంతా ఒకటే* చిత్రంలో.


*జమిందారుగారి అమ్మాయి*లో 'మంగమ్మా, నువ్వు నడుస్తుంటె అందం...' అంటూ రాజబాబులా గొంతు మెలికలు తిప్పుతూ పాడతాడు.

'కట్టు కథలు చెప్పి నేను నవ్విస్తే...' (*పదహారేళ్ల వయసు*) పాట విషాదంలో వున్న శ్రీదేవిని నవ్వించడం కోసం పాడే పాట. ముఖ్యంగా గాడిద అరుపులకి తాళం వేసే చరణంలో.

కేవలం సోలో పాటలు చెప్పాలంటే- ఏ దివిలో విరిసిన పారిజాతమో... (కన్నెవయసు), శివరంజని... (తూర్పు-పడమర), నిదరోయే నదులన్నీ (నాగమల్లి), సిరిమల్లె నీవే... (పంతులమ్మ) మొదలైనవి.

ఇంత వైవిధ్యం ఉన్న గాయకుడు తెలుగు చిత్రసీమలోనే కాదు, ఏ భాషా చిత్రంలోనూ మరొకరు కనిపించరు. ఇలా అందరి పాటలూ తానే పాడేసి మరి కొంతమంది గాయకుల అవకాశాలు అపహరించాడన్న అపప్రథ బాలూకి వుంది.

హాస్యగీతాలకే బాలూ పరిమితం కాలేదు. ఎన్నో విషాద గీతాలూ పాడాడు. కొన్ని పాటలు వింటూంటే గుండె దొలిచేస్తాయి కూడా.



పూర్వం సినిమాల్లో ఒక సంతోషమైన గీతం, అదే సాహిత్యంతో విషాద గీతం రెండూ ఉండేవి. ఇటువంటి పాటలు ఘంటసాల ఎన్నో సినిమాల్లో పాడాడు. సంగీత దర్శకుడు మహదేవన్ ఇలాంటి పాటలకి పెట్టింది పేరు.

*నాలాగ ఎందరో?* సినిమాలో 'అనుభవాలకు ఆది కావ్యం...' సంతోష గీతం సుశీల పాడితే, విషాద గీతం బాలూ పాడాడు. ఆ పాటకే బాలూకి మొదటి నంది అవార్డు వచ్చింది.

ఈ క్రింది పాటలు కొన్ని ఇలాంటివే.

'మామ చందమామ...' (*సంబరాల రాంబాబు*), 'ఏ తీగ పూవునో...' (*మరో చరిత్ర*), 'పూచే పూలలోన...' (*గీత*), 'నీవుంటె వేరే కనులెందుకు...' (*స్నేహం*), 'అమ్మను మించి దైవమున్నదా?' (*20వ శతాబ్దం*).

ఇక విషాదగీతలు ఎంతో హృద్యంగా పాడతాడు బాలూ. సినిమా చూడకపోయినా పాట వింటే చాలు మనసుని పిండేస్తా యన్నట్లుంటాయి. ఇవి కాకుండా- సినిమాల్లో కేవలం విషాద గీతాలు నాకు నచ్చినవి-

'ఎవరికి ఎవరు- చివరకి ఎవరు...' (దేవదాసు), 'తకిట తధిమి తందానా...' (*సాగర సంగమం*), 'ఒక హృదయంలో నా హృదయంలో...' (*కల్పన*), 'యాతమేసి తోడినా... ' (*ప్రాణం ఖరీదు*), 'శ్రీదేవి సింగారి సిలకా...' (*గృహప్రవేశం*), 'కొబ్బరాకు గాలి మబ్బు కేసింది...' (*నాలుగుస్థంభాలాట*), 'నేనొక ప్రేమ పిపాసిని...' (*ఇంద్రధనస్సు*), 'ఎడారిలో కోయిల...' (*పంతులమ్మ*).

ప్రత్యేకంగా పాటల పట్టీ ఇవ్వడానికి కారణం, ఏ యూ ట్యూబులోనో వినే అవకాశం వుంది కాబట్టి.

బాలూ కొన్ని వేల పాటలు పాడాడు. అన్ని పాటలూ చెప్పడం ఎవరికీ సాధ్యంకాదు. పైన ఉదహరించిన పాటలు సాహిత్యపరంగానూ, సంగీతపరంగానూ మంచి పాటలేకాక బాలూ మరింత మనసు పెట్టి పాడిన పాటలు.

*

బాలూ వట్టి గాయకుడేనా? కానే కాదు- సంగీత దర్శకుడు కూడా.

బాలూ సంగీత దర్శకుడిగా అంతగా రాణించ లేదని నా అభిప్రాయం. బాలూకి ఏదైనా ఫెయిల్యూర్ ఉందంటే ఇదొక్కటే అని చెప్పాలి.

గాయకుడిగా, డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా, నటుడిగా, వ్యాఖ్యాతగా- ఇలా ఎన్నో విభాగాల్లో తనదైన ముద్ర వేసినా, సంగీత దర్శకత్వం వరకూ వచ్చేసరికి చతికిల బడినట్లే అనిపిస్తుంది.

ఆ విషయానికొస్తే, ఘంటసాల ఎన్నో చిత్రాలకి సంగీత దర్శకత్వం వహించాడు. సంగీతపరంగా దాదాపు అన్ని సినిమాలు విజయవంతమైనవే. లవకుశ సినిమాలో అన్ని పాటలూ ఈనాటికీ గొప్ప పాటలు.

బాలుకి సంగీత దర్శకుడిగా మొదటి అవకాశం ఇచ్చింది దాసరి నారాయణరావు. ఆ సినిమా, కన్య-కుమారి. అందులో, 'తొలిసంధ్యకు తూరుపు ఎరుపు...' మినహాయించి, మిగతా పాటలన్నీ ఒక మోస్తరు పాటలుంటాయి.

ఆ తరువాత చేసిన సినిమా- కెప్టన్ కృష్ణ. నిజానికి ఈ సినిమా మొదట రిలీజయ్యింది. ఈ సినిమాలో, 'కలకాలం ఇదే సాగనీ...' పాట ఒక్కటే శ్రావ్యంగా ఉంటుంది.

ఆ తరువాత సంగీతం చేసిన సినిమా తూర్పు వెళ్లే రైలు. అది తమిళంలో భారతీరాజాకి పెద్ద హిట్ సినిమా. తెలుగులో తూర్పు వెళ్లే రైలు సినిమాకి దర్శకుడు బాపు. ముందుగా తమిళంలో సంగీతం చేసిన ఇళయరాజానే అనుకున్నారు. ఎందుకో ఆయన సంగీతం చేయలేదు.

ఈ సినిమాలో బాలూ గురించి ఆరుద్రని నేను పాతికేళ్ల క్రితం కలిసినప్పుడు నాకు చెప్పిన ఒక ట్రివియా.

తమిళ సినిమాలో హిట్ పాటకి దీటుగా ఆరుద్రని పాట రాయమని అడిగారట బాపూ. ఆరుద్ర పాట లేకుండా బాపూ సినిమా వుండదు. ఆ సన్నివేశ పరంగా- 'చుట్టూ చెంగావి చీరా కట్టావే చిలకమ్మా...' పాట రాసారు ఆరుద్ర.

ఇళయరాజా తప్పుకునేసరికి ఎవరా అను కుంటూంటే బాలూ నేను చేస్తాను అన్నారట. అలా పాటలన్నింటికీ సంగీతం సమకూర్చారు. బాలూ సంగీతమని తెలిసి ఆరుద్ర కంగారుపడ్డారట. ఎందు కంటే ఆయన రాసిన పాటకి ట్యూన్ సరిగా లేకపోతే మంచిగా వచ్చిన పాట పాడైపోతుందని ఆయన బాధ.

బాలూ కట్టిన ట్యూన్ వినేవరకూ ఆయనకి స్థిమితం లేదనీ, బాపూతో చెప్పగానే వెంటనే వినిపిం చారనీ, ఆ పాట విన్నాక- 'హమ్మయ్యా అని ఊపిరి పీల్చుకున్నాను. బాలూ చాలా మంచి ట్యూన్ ఇచ్చాడు,' అని చెప్పారు. ఆ పాట హిట్ అయ్యింది, సినిమా ఫట్ అయ్యింది.

ఎంతైనా పాడటం వేరు; వివిధ రాగాలతో పాటలు కట్టడం వేరూ.

ఆ తరువాత ఒకటి రెండు సినిమాలు చేసినా సంగీత దర్శకుడిగా బాలూ రాణించలేదు. శాస్త్రీయ సంగీతంలో లోతైన అధ్యయనం లేకపోవడం ఒక కారణం కావచ్చని నా అంచనా.

*

బాలూ ధరించిన మరో అవతారం- నటుడు. సినిమాల కొచ్చిన కొత్తలోనే అతిథి నటుడిగా చేసాడు. నటుడిగా మొదటి సినిమా- పెళ్లంటే నూరేళ్ల పంట. ఆ సినిమా విడుదలకి నోచుకోలేదు. మహమ్మద్ బిన్ తుగ్లక్ రెండో సినిమా. అందులోనూ అతిథి పాత్రే. తరువాత ఘంటసాల చనిపోవడంతో పాడే పాటల సంఖ్యా పెరిగింది.

అడవిరాముడు పెద్ద హిట్ కావడమూ, తమిళంలో ఇళయరాజా ప్రభంజనం మొదలవడంతో నటించే ఖాళీ దొరికుండకపోవచ్చు.

సంగీత దర్శకుడు చక్రవర్తితో కలిసి 1981లో పక్కింటి అమ్మాయి చిత్రంలో పూర్తినిడివి కల పాత్ర చేసాడు. ఆ సినిమా ఓ మోస్తరుగా నడిచింది. నటుడిగా తెలుగు, తమిళ, కన్నడ, మళయాళ భాషల్లో చేసాడు.

తమిళంలో కేలడి కన్మణి చిత్రం విజయవంతం అవడంతో దాన్ని ఓ పాపా లాలి సినిమాగా డబ్బింగ్ చేసారు. తన పాత్రకి తానే డబ్బింగ్ చెప్పుకున్నాడు. ఆ సినిమాలో 'మాటే రాని చిన్న దాని ఊసులు...' చాలా మంచి పాట. నటుడిగా కూడా పేరొచ్చింది.



ఆ తరువాత కూడా తెలుగులో కొన్ని సినిమాలు చేసాడు. కాస్త గుర్తుండే పాత్ర పవిత్రబంధం సినిమాలో చేసాడు. ఈ మధ్య తెలుగులో మంచి పేరొచ్చిన సినిమా- మిథునం. ఇది కూడా ఆడలేదు.

కేవలం నటన మాత్రమే కాదు, ప్రత్యక్షంగా కాక పోయినా సినిమా తీసి చేతులు కాల్చుకున్నాడు కూడా.

*

దక్షిణాదిన దాదాపు అన్ని భాషలూ రావడంతో సినిమాల్లో డబ్బింగ్ కూడా చెప్పాడు. నటుడు కమల హాసన్‌కి ఆస్థాన డబ్బింగ్ ఆర్టిస్ట్ బాలూ. కమలహాసన్ మాట్లాడుతున్నట్లే ఉంటుంది. రజనీకాంత్, రఘు వరన్, సుమన్ ఇంకా కొంతమందికి తెలుగులో డబ్బింగ్ చెప్పాడు.

గొంతు కంచు కంఠం కాబట్టి చాలామంది హీరోలకి నప్పేది. దానికితోడు మిమిక్రీ వెన్నతో పెట్టిన విద్య కావడంతో డబ్బింగ్ బాగానే అమిరేది.

ఒకటి మాత్రం నిజం- వృత్తిపరంగా ఏభయ్యేళ్ల లో ఎప్పుడూ ఖాళీగా లేడు. ఏదో ఒకటి చేస్తూ తనని తాను మార్చుకుంటూ వచ్చాడు. ఆఖరికి పాడుతా తీయగా వంటి కార్యక్రమాలతో టీవీవైపు కూడా పని చేసాడు,

పాడుతా తీయగా కార్యక్రమంతో ప్రతీ ఇంటా బాలూ పేరు మార్మోగింది. గతంలో తాను పాడిన పాటల సందర్భాలూ, అనుభవాలూ ఎంతో శ్రద్ధగా వివరాలతో చెప్పడంతో అందరూ ఉత్సాహంగా విన్నారు కూడా.

నిజానికి బాలూకొచ్చినన్ని అవకాశాలు ఏ గాయకుడికీ రాలేదు. వచ్చిన అవకాశాలన్నీ తన విజయపథాలుగా మార్చు కున్నాడు.

ఏ గాయకుడికీ లేనీ, దక్కని ఒక మహత్తర అంశం బాలూకి దక్కింది.

తెలుగు, కన్నడ, తమిళ, మళయాళ భాషల్లో దాదాపు అందరి సంగీత దర్శకుల దగ్గరా పాటలు పాడాడు. బాలూ తమ సంగీత దర్శకత్వంలో పాడడం వారికి గర్వకారణం అని సంగీత దర్శకులు చెప్పుకునే స్థాయికి ఎదిగాడు.

తెలుగులో ప్రతీ పాటల రచయిత పాటలూ బాలూ పాడాడు. ఒక్క తెలుగనే కాదు, మిగతా భాషల్లో- కన్నడ, తమిళ, మళయాళంలో కూడా.

బాలూ దగ్గర మెచ్చుకోదగ్గ గొప్ప అంశం ఒక టుంది, ముఖ్యంగా డబ్బింగ్‌లో. ఏ భాషలో చెబు తున్నా ఉచ్చారణలో ఎక్కడా పొరబాట్లు దొర్లేవి కాదు.

తెలుగు సరే మాతృభాష. తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో కూడా ఆయా భాషల నుడికారాన్ని నేర్చుకుని అలాగే డబ్బింగ్ చెప్పేవాడు. వృత్తిపట్లా, చేసే పని ఎడలా ఎంతో శ్రద్ధ వుంటే కానీ ఇలాంటివి సాధ్యపడవు.

ఎదుటివారి ఎడల వినయమూ, కళ పట్ల గౌరవం చూపించడంలో బాలూ ముందుంటాడు.

ఇది బాలుకున్న ఉత్తమ లక్షణం. అందుకే బాలూకి ఎంతోమంది అభిమానులు. వారిలో గాయకులూ, సంగీత దర్శకులూ మొదటుంటారు.

వయసుపైబడినా తన చివరిశ్వాస వరకూ పని చేస్తూనే ఉన్నాడు, ఒక కర్మయోగిలా!

*

పాడుతా తీయగా అంటూ తెలుగునాట సినిమా పాటలతో ఒక కొత్త కార్యక్రమం చేబట్టాడు బాలూ.

గోల్డెన్ హ్యాండ్ కదా- ఇదీ సూపర్ హిట్టే!

మొదట తెలుగులో మొదలై అన్ని భాషల వారూ ఈ కార్యక్రమాన్ని చేబట్టారు.

ఈ ప్రోగ్రాం దాదాపు ఇరవయ్యేళ్లుగా నడిచింది.

వీటిలో తన అనుభవాలూ, సంగీత దర్శకుల

ముచ్చట్లూ, సినిమా పాటలు పాడేటప్పుడు జరిగిన అరుదైన సంఘటనలూ- ఇలా ఎన్నో విషయాలు చెబుతూ ఆ కార్యక్రమానికి వన్నె తెప్పించాడు.

ఎంతోమంది కొత్త గాయనీ గాయకుల్ని పరిచయం చేసాడు.

పిల్లలకి ఎక్కడ ఎలా పాడాలీ, పాడేటప్పుడు సంగతులు ఎలా పలకాలీ, ముఖ్యంగా పాడేటప్పుడు ఎక్కడ, ఎలా ఊపిరి తీసు కోవాలీ, ఉచ్చారణ ఎలా వుండాలీ ఇవన్నీ సుస్పష్టంగా చెప్పడం చాలా గొప్ప విషయం.

ఎవరికి వారు బాగా పాడేను అనుకోవడం సర్వ సాధారణం. కానీ తప్పుల్ని సవరించుకునేలా చెప్పడం, ఇవన్నీ బాలూ అలవాటు చేసాడు, పిల్లలకి.

అలాగే ఎంతోమంది సంగీత దర్శకులనీ, నటుల్నీ అతిథులుగా పిలుచుకొచ్చి వారి అనుభవాల గురించి చెప్పడం, సినిమా పాటల వెనుకున్న కృషినీ, శ్రమనీ విపులంగా వివరించడం- ఇవన్నీ గొప్ప విషయాలు.

నభూతో నభవిష్యతి- అన్నట్లుగానే ఇరవ య్యేళ్లు ఈ కార్యక్రమాన్ని నడిపించాడు బాలు.

*

మా చిన్నప్పుడు గుళ్లల్లో ఏవైనా తీర్థాలూ, పుణ్య దినాలూ వస్తే లౌడ్ స్పీకర్లు పెట్టి పాటలు వేసేవారు. అప్పుడు రేడియో, టేప్ రికార్డర్ తప్పించి సినిమా పాటలు వినే అవకాశమే లేదు.

ఆ గుళ్లల్లో ఘంటసాల భగవద్గీత, కుంతీ విలాపంలాంటి ప్రైవేటు రికార్డులు వేసే వారు.

ఘంటసాల చనిపోయాకా బాలూ కూడా కొన్ని ప్రైవేటు రికార్డులు చేసాడు. వీటిలో ముఖ్యంగా చెప్పుకోదగ్గవి- శివాష్టకం, బిల్వాష్టకం వంటివి. వీటికి సంగీత దర్శకుడు రమేష్‌నాయుడు.

దర్శకుడు జంధ్యాల అన్నమయ్య సినిమా తీద్దామని స్క్రిప్ట్ అంతా రెడీ చేసు కున్నారు. ఆ సినిమాకి సంగీత దర్శకుడు రమేష్‌నాయుడు.

సినిమా నిర్మాణంలో చిత్రీకరణ కంటే ముందు పాటలు రికార్డింగ్ చేయడం ఒక ఆనవాయితీ. అలా రమేష్ నాయుడు ఓ పన్నెండు పాటలకి పైగా రికార్డ్ చేసారు.

బాలసుబ్రహ్మణ్యం సశాస్త్రీయంగా పాడిన ఆ అన్నమయ్య కీర్తనలు వినడానికి హాయిగా ఉంటాయి. కొన్ని కీర్తనలు అద్భుతంగా పాడాడు. మనసు పెట్టి కాదు, గుండె పెట్టి పాడిన పాటలివి.

ఆ సినిమా ఎందుకో షూటింగ్ కాలేదు. ఈలోగా జంధ్యాల పరమపదించాడు. లేకపోతే తరువాతొచ్చిన అన్నమయ్య పాటల కంటే ఇవే అందరి నోటా నానుండేవి.

బాలూ కూడా భగవద్గీత చేసారుగానీ, ఘంట సాలది విన్నాక ఎవరిదీ వినబుద్ధి కాదు.

బాలూ అయ్యప్ప పాటలూ, క్రైస్తవ గీతాలూ వినదగ్గ పాటలు.

*

ఒకానొక సందర్భంలో బాలూ గురించి చెబుతూ, ప్రఖ్యాత దర్శకుడు బాలచందర్- 'మరో జన్మ వుంటే నన్ను బాలూలా పుట్టించమని దేవుణ్ణి కోరుకుంటాను,' అన్నారు.

కన్నడ వాళ్లయితే దేవుళ్లా ఆరాధిస్తారు. తమిళు లు సరేసరి.

*శంకరాభరణం*తో బాలూ భారతదేశమంతా తెలిసినా, గాయకుడిగా హిందీలో అవకాశాలు అంతగా రాలేదు.



బాలచందర్ మరోచరిత్ర సినిమాని ఏక్ దూజేకే లియే పేరుతో హిందీలో తీసాడు. బాలూ హిందీలో పాడడం అదే మొదటిసారి. సినిమా సూపర్ డూపర్ హిట్. ఆ ఏడు బెస్ట్ సింగర్ అవార్డు దక్కింది బాలూకి.

ఆ తరువాత మైనే ప్యార్ కియా మరో పెద్ద హిట్. హిందీలోనూ తన ప్రతిభ చాటుకున్నాడు. అవార్డులూ వచ్చాయి.

బాలూ దాదాపు అందరి గాయనీమణులతోనూ సినిమాల్లో పాడాడు.

సుశీల, జానకి, వాణీ జయరాం, ఎల్.ఆర్ ఈశ్వరి, లతా మంగేష్కర్, ఆశాభోంస్లే, అనూరాధా పొడ్వాల్, చిత్ర, అల్కా యాగ్నిక్, శ్రేయా ఘోషాల్- ఇలా పాతతరం వారితోనూ, ఇప్పటి తరం వారితోనూ పాడాడు. ఏ గాయకుడుకీ దక్కని పెద్ద రికార్డ్ ఇది. అందరిలోకీ జానకీ, సుశీల, చిత్రలతో ఎక్కువ పాటలు పాడాడు.

అన్ని భాషల్లోనూ కొన్ని వేల పాటలు పాడడం, అదీ అయిదారు దశాబ్దాలుగా, బాలూకి మాత్రమే ఉన్న ఏకైక రికార్డు. ప్రతిభావంతుడైన బాలూ ఈ విధంగా అదృష్టవంతుడు; ధన్యుడు.

దక్షిణాది వారికి ఒకే ఒక బాలసుబ్రహ్మణ్యం.

ఇలాంటివారు ఇంకొకరు పుట్టబోరు.

పుట్టినా వీరంత ఎత్తు ఎదగలేరు.

ఎదిగినా- అన్ని భాషలవారినీ అలరించనూ లేరు.

ఇది- పద్మవిభూషణ్ శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం, అందరూ ఆప్యాయంగా పిలుచుకునే బాలూకి మాత్రమే సొంతమైన గోల్డెన్ డిస్క్!

నిజానికి బాలూ మనింట్లో మనిషి.

అందుకే అందరం బాలూ అని పిలుచుకుంటాం.

బాలూ అన్న పిలుపు మనసుకి దగ్గరగా వుంటుంది.

బాపూ, రమణలు తాము గీసి/రాసిన 'లీలా జనార్ధనమ్' పుస్తకాన్ని బాలసుబ్రమణ్యానికి అంకితం ఇస్తూ, ఇలా అన్నారు:



## అవార్డుల పంట

| | |
|---|---|
| పద్మశ్రీ | 2001 |
| పద్మభూషణ్ | 2011 |
| పద్మవిభూషణ్ | 2021 |
| గౌరవ డాక్టరేట్‌లు | పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్శిటీ<br>సత్యభామ యూనివర్శిటీ, చెన్నై<br>ఆంధ్ర యూనివర్శిటీ<br>జెఎన్‌టియు, అనంతపూర్<br>ద ఇంటర్నేషనల్ తమిళ్ యూనివర్శిటీ, యుఎస్ఎ |

జాతీయ ఉత్తమ గాయకుడు పురస్కారం – 1979, 81, 83, 88, 95, 96

నంది పురస్కారం – 25 సార్లు

తమిళనాడు రాష్ట్ర పురస్కారం – 4 సార్లు

కర్ణాటక రాష్ట్ర పురస్కారం – 3 సార్లు

సైమా అవార్డు

తమిళనాడు ప్రభుత్వ అవార్డు 'కలైమామణి'

ఇవేకాక అనేక ఇతర అవార్డులు

"గాయకుడిగా జీనియస్... మనిషిగా అజాతశత్రువు... మాకు ఆయన పరిచయం కలగడం భగవంతుడిచ్చిన వరం."

ఇద్దరు గొప్పవారు గొంతెత్తి మరో గొప్ప వ్యక్తిని స్తుతించారు.

ఈ ముగ్గురూ తెలుగువారవ్వడం మనందరికీ గర్వకారణం.

WWW.TECHINSURANCEINC.COM

# YOUR EMPLOYEES HEALTH OUR PROMISE



**HEALTH INSURANCE FOR IT COMPANIES**

**BUSINESS INSURANCE**

**VISITORS INSURANCE**



**MURALI TALLURI**
FOUNDER
+1 (512) 917 - 8686
murali@techinsuranceinc.com

TECH INSURANCE AGENCY
EMPLOYEE BENEFITS & BUSINESS INSURANCE

(512) 917-8686
Fax:1-512-829-3488

Contact us:3000 Polar Ln, Unit#802
Cedar Park ,TX,78613



# ఆనాటి వాన చినుకులు

ఎన్టీఆర్ గార్డెన్స్‌లో బుక్ ఫెయిర్ జరుగుతోంది. ముందు హైదరాబాద్ స్టడీ సర్కిల్లో జరుగుతున్న వేమూరి సత్యంగారి ఆనాటి వాన చినుకులు బుక్ రిలీజ్ ఫంక్షన్ చూసుకుని అక్కడ్నుంచా బుక్ ఫెయిర్ కెళ్దామని బయల్దేరిన నన్ను ఏనాడో పరిచయమైన సత్యంగారి జ్ఞాపకాల వానచినుకులు తడుపుతున్నాయి. పందొమ్మిది వందల డెబ్బై ఏడు కాలంలోకెళ్లిపోతున్నాను.

*



# మరో ప్రయాణపు జ్ఞాపకాలు

ట్రస్ట్‌పురంలో 12బి బస్సెక్కి పాండీబజార్లో దిగిన నేను, “మూసాసెయిట్ స్ట్రీట్ ఎక్కడా,” అని అరవ జనాన్ని అడుగుతా ఆళ్లు చెప్పే లెఫ్ట్, రైట్ డైరెక్షన్లని ఫాలో అవుతా ఆ జ్యోతి మంత్లీ ఆఫీసు కెళ్లేటప్పటికి కొన్ని గంటలు పట్టింది.

లోపలికెళ్లగానే ఎవరి కోసమొచ్చేవంటా నాకు ఎదురైన ఆ మనిషితో, “భారతి అని ఒక నవల పంపించేను మీ పత్రికకి. దాని సంగతేమయ్యిందో కనుక్కుందామనొచ్చేను,” అన్నాను.

కూర్చోమంటా సైగ చేసినా మనిషి లోపలికెళ్లిన కాసేపటికి పొడుగాటాయన నా భారతి వ్రాతప్రతి పట్టుకొచ్చి నా ముందు పెట్టి, “ఇది రాసింది నువ్వేనా?” అన్నారు.


“అవునండీ,” అన్నాను.

“చూస్తుంటే చిన్న కుర్రోడిలాగున్నావ్, వయసెంత?”

“పదిహేడో ఎంతో...”

“ఇంతకుముందేం రాసేవ్?”

“మొదటి కథ ఆంధ్రజ్యోతిలో వచ్చింది. ఎడిటర్ పురాణం సుబ్రహ్మణ్య శర్మగారు. మంచుపల్లకీ నవలా ప్రియదర్శినీ పథకంలో ఆయనే వేసేరు... మీకిప్పుడు పంపించింది మూడో నవల,” అన్నాను.



"చిన్న వయసులోనే చాలా రాసేసేవ్," అంటా భారతి నవల కాయితాలు ముందుకి జరిపి, "ఈ నవల మా పత్రికలో వెయ్యడంలేదు... కూర్చో," అనేసి లోపలికెళ్లేరు.

స్క్రిప్ట్ మొదటి పేజీ తిరగేస్తే పేజీ మూల మరో చలం? అని రాసి కొశ్చన్ మార్క్ పెట్టి వుంది.

ఏవో ఫైళ్లూ కాయితాలూ పట్టకునొచ్చినాయన, "ఇప్పుడెక్కడికెళ్లాలి నువ్వు?" అన్నారు.

"ట్రస్ట్‌పురం... అక్కడ్నించే వొచ్చేను," అన్నాను.

"నేను పేరిస్ వెళ్తున్నాను, నాతోపాటొస్తావా?" అన్నారు.

'సరే' అన్నాను. ఆ మనిషి వేమూరి సత్య నారాయణ... ఎరిగినోళ్లు 'సత్యం' అని పిలుస్తారంట.

"ఈ వూళ్లో పనేంటి. ఎందుకొచ్చేవ్," అనడిగితే, "సినిమా ఫీల్డులో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచెయ్యడాని కొచ్చేను," అని చెప్పేను.

"చలాన్ని బాగా చదివేవా?" అన్నారు.

"లత, బుచ్చిబాబుల సాహిత్యం కూడా చదివేను. మా ఫ్రెండ్ రవి చదవమన్న రవీంద్రనాథ్ టాగోర్ క్షుదిత పాషాణాలు కథంటే చాలా యిష్టం," అంటా చెప్తుంటే, "చాలా ఎక్కువ చదివి, చాలా తక్కువ రాయి," అన్నారు.



లేడీస్ టైలర్ వర్కింగ్ స్టిల్

డుబల్ డెక్కర్ ఎక్కేం. పైన కూర్చున్న నాకు విమానం ఎక్కినట్టుంది. అదే ఆ సత్యంగారితో అంటే, నవ్వేరు.

మౌంట్ రోడ్లో రకరకాల స్టాపులు దాటుకుంటా చివరి స్టాపయిన పేరిస్‌లో ఆగిన బస్సులోంచి దిగి నడుచుకుంటా ఫ్రాన్సిస్ జోసఫ్ స్ట్రీట్‌లో ఉన్న క్రాంతి ప్రెస్‌కి వెళ్లేం. జ్యోతి మంత్లీ అక్కడే ప్రింటవుద్దంట.

ఆ ప్రెస్ ఓనర్ ధనికొండ హనుమంతరావుగారు. ప్లెయిన్ గోల్డ్ ఫ్లేక్ సిగరెట్ వెలిగించినాయన దగ్గర కెళ్లి, "మీ మగువ మనసు నవల యువలో వస్తున్న పుడు చదివేనండి," అన్నాను.

"అలాగా.... అంతకుముందెప్పుడో అభిసారికలో సీరియల్‌గా వచ్చిందది. రీడర్స్ గొడవ చేస్తే సీరియల్ పూర్తవ్వకుండానే బుక్‌ఫామ్‌లో వచ్చేసింది," అంటా చాలా చెప్పేరా నవల గురించి.

మధ్యాహ్నం భోజనానికి జనంతో కిటకిటలాడి పోతున్న నేషనల్ లాడ్జికి తీసుకెళ్లేరు సత్యంగారు. మా టోకెన్ నెంబర్ రెండు వందల ఏడు. 'అయ్యబాబోయ్,' అనుకుంటుంటే, "ఇక్కడికొస్తే ఇంతే," అన్నారు.

*

జ్యోతి ఆఫీసు కోడంబాక్కం రాజారాం డైరెక్టర్స్ కాలనీలోకి మారడంతో నేనుంటున్న ఏరియాకి దగ్గరైందిప్పుడు. దాంతో చాలా రెగ్యులర్‌గా కలుస్తుండేవాడ్ని సత్యం గార్ని.

సాయంత్రమైతే నేనొచ్చినట్టే వడపళని బస్సు దిగొచ్చేవాడు నాయుని కృష్ణమూర్తిగారు. ముగ్గురం ఆర్కాట్ రోడ్‌లో వున్న హాలీవుడ్ హోటల్ కెళ్లేవాళ్లం టీకోసం. అప్పుడప్పుడూ ఓల్డ్ వాషర్‌మేన్ పేట నించొచ్చే కార్టూనిస్ట్ జయదేవ్‌బాబు, గోపాల్‌గార్లు మాతో కలిసేవాళ్లు. వయసుతోపాటు మిగతా అన్ని విషయాల్లోనూ చాలా పెద్దోళ్లాళ్లు. మాటాడు కుంటుంటే




*మంచుపల్లకీ వర్కింగ్ స్టిల్*

మధ్యలో దూరతా వుండేవోడ్ని.

దీపావళి స్పెషల్‌కి బొమ్మలెయ్యడానికి చంద్ర, ఎప్పుడన్నా యర్రంశెట్టి సాయి, వి. రాజారామమోహన రావు దిగేవారు హైదరాబాదు నించి.

వాళ్లంతా సత్యంగార్ని కలిసేది అప్పుడప్పుడూ అయితే నేను కలిసేది ఎప్పుడుబడితే అప్పుడు.

కోడంబాకం బ్రిడ్జి ఎక్కడానికి ముందు ఎడం పక్కకి తిరిగితే వచ్చే వరదరాజపేట మెయిన్ రోడ్లో సినిమా యాక్టర్ జయమాలిని ఫ్యామిలీ డాక్టర్ వెంకట సుబ్రగామణ్యంగారి జయశ్రీ క్లినిక్. అది దాటగానే కుడిపక్కనున్న పన్నెండో నెంబర్ ఇంటి వెనకభాగంలో అద్దెకుండేవారు సత్యంగారు. పైన మిక్కిలినేని జగదీష్ బాబు.

రోజూ పొద్దుటే వెళ్లి ఇనపగేటు తీస్తా వుంటే ఇంటి ఓనర్ రామారావుగారు గేటు సరిగ్గా ముయ్యమని కేకలేస్తా వుండేవాడు.

లోపలికొచ్చి, రాత్రంతా బేంక్ రామారావు గారింట్లో పేకాడొచ్చి నిద్రపోతున్న ఆ సత్యంగార్ని నిద్రలేపే ప్రయత్నం చెయ్యడం, ఎంతకీ ఆయన లేవకపోతే ఆయన భార్య శ్రీలక్ష్మిగారిచ్చే కాఫీ తాగుతా ఆ గది కిటికీలో వున్న ఆ పెద్ద బౌండు తిరగేస్తా ఉండేవాడ్ని.

మొదలెట్టి కొంతవరకూ రాసి వదిలేసిన కథలు చాలా ఆ బౌండు బుక్కులో కనపడేవి. కొన్ని కథలకైతే బ్రహ్మాండమైన బిగినింగ్‌లు.

ఈలోగా నిద్ర లేచి కాఫీ తాగుతా సిగరెట్ వెలిగించే సత్యంగారు అదీ ఇదీ మాటడతా ఒకనాడు రిక్షా వెనక తను చదివిన ఆనాటి వానచినుకులు గురించి అప్పుడు చెప్పిందే... అలాంటివాయన చెపుతుంటే నేనీమధ్య మౌంట్‌రోడ్లో చూసిన ఇంగ్లీషు సినిమాల గురించీ, నాకిష్టమైన భారతీరాజా గురించీ, పుట్టణ్ణ కణగాళ్ ధరణి మండల మధ్యదొళిగె కన్నడ సినిమాలో షాట్స్ గురించీ, బెంగాలీ డైరెక్టర్ రిథ్విక్ కుమార్ ఘటక్ సినిమా మేగా డాకే తారా గురించీ తెగ వాగుతుంటే, "ఇవన్నీ సరే, బైసికిల్ థీవ్స్ సినిమా ఎక్కడైనా ఫిలిం సొసైటీల్లో వేస్తే చూడు. దాని డైరెక్టర్ విట్టోరియా డెసికా... చార్లీచాప్లిన్‌కి ఋణపడి ఉంటానని బహిరంగంగా ఒప్పుకున్నాడు. మ్యూటినీ ఆన్ ది బౌంటీ, ఫ్రమ్ హియర్ టు ఎటర్నిటీ లాంటి గొప్ప హాలీవుడ్ సిన్మాలు చూడు... నాకు ఎప్పటికీ గుర్తుండే గొప్ప సినిమా రోమన్ హాలీడే. అలాగే బిమల్‌రాయ్ మధుమతి, గురుదత్ సాహిబ్ బీవీ ఔర్ గులామ్ లాంటి సినిమాలు చూడు," అంటా చాలా చెప్పు

కుంటాపోయేవారు. అలాగే సహవాసిగారు అనువాదం చేసిన ఏడుతరాలు లాంటి నవలలు చదవమనేవారు.

అలా సత్యంగారు మాటాడేవి వింటా అలాంటి సిన్మాలు చూస్తా మళ్లీ సత్యంగారి దగ్గరకొచ్చి మాటాడ్తా వుండే నేను మద్రాసులో ఖాళీగా వుంటే వెళ్లేది రెండే ప్లేసులు. ఒకటి ఏడిద నాగేశ్వర్రావుగారిల్లు, రెండు వేమూరి సత్యంగారుండే చోట్లు.

జ్యోతిలో పనిచేస్తానే ఇంకోపక్క సినిమాలకి పి.ఆర్.ఓ.గా కూడా చేసేవాడాయన. ఆటోలో ఆయన కూడా విజయచందర్‌గారి కరుణామయుడు సినిమా ఆఫీసుకెళ్లేవోడ్ని. నా గురించా విజయ్‌చందర్‌గారికేం చెప్పేడో సత్యంగారు. ఒకరోజు నన్ను పిల్చి, "నీకు సినిమా డైరెక్టర్ ఛాన్స్ ఇస్తున్నాను. ఇదిగో అడ్వాన్స్," అంటా రెండొందల యాభై రూపాయల చెక్కునాకిస్తా, "ఇది టోకెన్ అమౌంట్లే. అసల్ది తర్వాతిస్తాను. కథ ఆలో చించి చెప్పు," అంటే వెంటనే నేనో కథ చెప్పేను.

అది సినిమారూపం దాల్చలేదుగానీ ఇప్పటికీ తియ్యడానికి పనికొచ్చే ఆ కథ సత్యంగారితో పాటు తర్వాత ఫీల్డులోకొచ్చిన స్రవంతీ నిర్మాతలక్కూడా తెల్సు.

*

ఒకరోజెళ్లి నిద్రపోతున్న సత్యంగార్ని లేపుతుంటే, "ఇందాకే పడుకున్నాను," అన్నారు.

"ఇంతసేపు ఆడేరా పేకాట?" అన్నాను.

"పేకాట కాదయ్యా. చలిచీమలు సినిమా వెండి తెర నవల రాస్తున్నాను," అన్నారు.

గతంలో మా బంగారక్క, ప్రేమాభిషేకం, దేవదాసు మళ్లీ పుట్టాడు, రామకృష్ణులు సిన్మాలకి ఈయన వెండితెర నవలలు రాసిన గమ్మత్తైన అను భవాలు చాలా వున్నాయి.

క్రాంతికుమార్‌గారి స్వాతి సినిమాకి ప్రొడక్షన్ డిజైనర్‌గా చేసిన సత్యంగారు రాజమండ్రిలో గోదావరి సేవింగ్ సిండికేట్ ఓనరూ విజయ్‌చందర్‌గారికి ఫ్రెండూ అయిన ఎమ్మార్ ప్రసాదరావుగారు సినిమా చేద్దాం అంటే పాలైవన చోళై అన్న సినిమాని ముఫ్ఫై రెండు వేలకి కొన్నారు.

తర్వాత డైరెక్టరెవర్ని పెడదామా అనుకుంటా ముందు బాపుగారితో మొదలెట్టి తర్వాత జంధ్యాల లాస్ట్‌కి ఈరంకిశర్మగారి దాకా రకరకాల వాళ్లననుకుని చివరికి నన్ను ఫైనలైజ్ చేసేరు.

"వద్దండి బాబోయ్..." అన్నాను.

"ఎందుకు?" అన్నారు.

"సినిమా అంటే మాటలు కాదు. నేను నేర్చుకోవాల్సింది చాలా ఉంది. నా ముఫ్ఫయ్యవ ఏటవుతాను డైరెక్టర్ని," అన్నాను.

"నేర్చుకున్నది చాల్లే. నీమీద నాకు చాలా నమ్మకం," అన్నారు సత్యంగారు.

"నాకు లేదు," అంటాను నేను.

వదలడంలేదు సత్యంగారు.

ఓ వారంపాటు నానా అవస్థ పడ్డ నేను, "ఒకరకంగా చేస్తే డైరెక్షన్ చెయ్యడానికి ఒప్పుకుంటాను," అన్నాను.

'ఏ రకంగా,' అన్నట్టు చూసేరు సత్యంగారు.

"మొత్తం యూనిట్‌నీ, ఓ వెయ్యి అడుగుల ఫిలింనీ, కొందరు డమ్మీ ఆర్టిస్టుల్ని నాకిస్తే షూట్ చేసేకా నిర్ణయానికొస్తాను," అన్నాను.

నేనడిగిన ఏర్పాట్లు చేసేరు సత్యంగారు.

షూట్ చేసి రష్ చూసుకున్న నాకు కాస్త కాన్ఫిడెన్సొచ్చింది. "నేను డైరెక్షన్ చేస్తాను. అయితే, మీరు పెట్టిన అసోసియేట్ డైరెక్టర్ ఇబ్బంది పెడ్తున్నాడు. అతన్ని తీసెయ్యండి," అన్నాను.

"సరే," అని సత్యంగారన్నాకా నేను తీసిన సినిమా... మంచుపల్లకీ.

మా గురువు శ్రీ కె. విశ్వనాథ్‌గారు చాలా మెచ్చుకున్న మంచుపల్లకీకి మంచి పేరే వచ్చిందిగానీ అప్పటికే కాస్త ఇమేజ్‌లోకొచ్చిన చిరంజీవి క్లైమాక్స్‌లో డోర్ కర్టెన్ పట్టుకుని వేలాడ్తా, 'గీతా' అంటా ఏడ్వడం నచ్చలేదు జనానికి. దాంతో లక్ష్మీ ఫిలింస్ లింగమూర్తి గారు అనుకున్నంత బాగా ఆడలేదా మంచుపల్లకీ.

తర్వాత నేను తీసిన సితార, అన్వేషణ,

ప్రేమించు-పెళ్లాడు, ఆలాపన సినిమాల్లో సత్యంగారి ఇన్వాల్వ్‌మెంటు లేదు.

విజయవాడ నించి దిగిన ముగ్గురు యంగ్ ప్రొడ్యూసర్లు నా దగ్గరకొస్తే వాళ్లని సత్యంగారికి పరిచయం చేసేను.

రాళ్లపల్లిగారి ద్వారా నాకు పరిచయమైన కొత్త రైటర్ తనికెళ్ల భరణి, సత్యంగారూ నేనూ ఆ ప్రొడ్యూసర్లూ పడ్డ అవస్థ యొక్క ఫలితమే లేడీస్ టైలర్ సినిమా.

లాయర్ సుహాసిని సిన్మాకి వేమూరి సత్యం గారూ తనికెళ్ల భరణీ బెంగుళూరెళ్లి చేసుకొచ్చిన ట్రీట్‌మెంట్ నాకు నచ్చలేదు.

నాకు కావల్సొచ్చినట్టు రాయించిన స్క్రిప్ట్‌తో నుంగంబాకం సుబ్బారావు ఎవెన్యూలో వున్న మలయాళం హీరోయిన్ జయభారతి ఇంట్లో సినిమా తీస్తే, చూసిన సత్యంగారు బానే వుందన్నారు.

అయితే, లెంగ్త్ ఎక్కువగా వుంది, పన్నెండు వేల అయిదొందలకి ఎక్కువైతే డ్యూటీ పడ్తుంది. కాబట్టి తగ్గించమని రిక్వెస్ట్ చేసేడు ప్రొడ్యూసరుగారు.

దాంతో బాగా షార్ప్ చేసేటప్పటికి డ్రామా మొత్తం ఎగిరిపోడంతో తేడా చేసేసింది సినిమా.

ఎందుకలా ట్రిమ్ చేసేవంటా నామీద చాలా కేకలేసేరు సత్యంగారు.

బాగున్న శ్రీ కనకమాలక్ష్మి రికార్డింగ్ డేన్స్ ట్రూపు తెలంగాణాలోనూ రాయలసీమలోనూ రికార్డింగ్ డేన్సులు లేకపోడం వల్ల ఆడలేదు.

వేమూరి సత్యనారాయణగారు కథ రాసిన మహర్షి సిన్మాకి చాలా అద్భుతమైన పాటలు. డైలాగ్ నాకు నచ్చకపోయేటప్పటికి అలిగేను. మొత్తానికి బానే వచ్చిన సిన్మా ఇప్పటికి చాలామంది మెచ్చుకునే ఆ సిన్మా ...అది కూడా ఆడలేదు.

ఇంకా నేను తీసిన చాలా సినిమాలకి స్క్రిప్ట్ కోఆర్డినేటర్‌గానూ, ప్రొడక్షన్ డిజైనర్‌గానూ చేసిన సత్యంగారికి ఏనాడూ నేను పూర్తిగా నచ్చను. కానీ, పూర్వం సినిమాల్లో అల్లురామలింగయ్య, సత్యనారాయణల్లా కలిసే ఉంటాం.



*మంచుపల్లకీ అప్పుడు సుహాసినితో వంశీ*



వేమూరి సత్యనారాయణ

లింగబాబు లవ్‌స్టోరీ, వైఫాఫ్ వి. వరప్రసాద్ సినిమాలు బాగా నిరాశపర్చడంతో కొన్నాళ్లపాటు సిన్మాలకి దూరంగా వుందాం అన్జెప్పి యూనాం వచ్చేసేను.

అక్కడ కొన్నాళ్లున్న నాకు నలుగురే ఫోన్లు చేసేవారు.

వేమూరి బలరామ్, జె.డి. చక్రవర్తి, రామ్‌గోపాల్ వర్మ బావగారు సుబ్బరాజు, వేమూరి సత్యనారాయణ.

ఆవేళ సత్యంగారి దగ్గర్నించి ఫోను... "వేమూరి రమేష్ అనే మా ఫ్రెండ్ చికాగోలో ఉంటాడు. కమింగ్ టు అమెరికా సినిమాని తెలుగులో చెయ్యాలంట. బయల్దేరి రా," అంటే వచ్చేను హైదరాబాదు.

ఆ ప్రాజెక్ట్ వర్కవుటవ్వలేదు.

మండవ గోపాలకృష్ణగారూ జయకృష్ణ ఇంకో ఇద్దరూ నాతో సినిమా చేద్దామనుకున్నారుగానీ ఏదీ వర్కవుటవ్వ లేదు.

దాంతో గూడూరి విశ్వనాథశాస్త్రి ఎప్పుడో నాకు చెప్పిన చిన్న పాయింటొకటి తీసుకుని కొన్నాళ్లపాటు తలుపులేసుకుని డిటెయిల్డ్ వెర్షన్ రాస్తే చాలామందికి నచ్చిందిగానీ చివరికి వల్లూరిపల్లి రమేష్ ద్వారా అది ఫైనలైజయ్యి ఔను... వాళ్లిద్దరూ ఇష్టపడ్డారుగా బయటికొచ్చినా సినిమాకి స్క్రిప్ట్ కోఆర్డినేటర్ వేమూరి సత్యనారాయణ.

ఇక్కడ్నించి స్క్రిప్ట్ కోఆర్డినేటర్‌గా చేసిన సత్యం గారు ఆమధ్య విడుదలై ఫ్లాపయిన ఫ్యాషన్ డిజైనర్ సినిమాకి పనిచెయ్యలేదు.

అయితే, రీసెంట్‌గా ఆయన ఎడిటర్‌గా ఆనాటి వానచినుకులు కథాసంకలనం విడుదల చేసేరు.

వెనకటికెప్పుడో వాళ్లింటికెళ్లినప్పుడు చెప్పిన కథే. ఒక చిన్న గ్రామం దగ్గర ఎర్రబస్సు దిగిన ఆయన, రెండు మైళ్ల దూరంలో వున్న ఆ కుగ్రామంలోకెళ్లా లంటే జట్కాగానీ రిక్షాగానీ అవ సరం. ఒకోసారి అవి వుండవు. ఒకరోజీయనెళ్లి నప్పుడు అక్కడున్న ఆ డొక్కు రిక్షా వెనకాల 'ఆనాటి వాన చినుకులు' అని రాసుంది. ఇంత మారు మూలున్న ఆ గ్రామం రిక్షా మీద అంత భావు కత్వంతో కూడిన ఆ వాక్యం రాసిన మనిషెవరు? అన్న అంశం మీద ఒకో రచయితకీ చెప్పి ఒకో కథ రాయించేరు. రచయితలు వేరుగానీ అన్ని కథలకీ టైటిల్ అదే. చాలా మంచి ఆలోచన. కొత్త ఆలోచన అనిపించిన జనం ఆదరిస్తున్నారు. ...పుస్తకం హిట్టు.

ఆమధ్యెప్పుడో ఆయన్నడిగేను. "ఫలానా ప్రొడక్షన్ కంపెనీకి స్క్రిప్ట్ కోఆర్డినేటర్‌గా చేస్తున్నారు గదా ఇప్పుడాళ్లు చేసే కొత్త సినిమాకి చెయ్యడం లేదా?" అని.

"వాళ్లకి నేను అవుట్‌డేటెడ్ మనిషినైపోయానేమో నన్నిప్పుడు పిలవడంలేదు," అన్నారు.

నా దృష్టిలో వేమూరి సత్యంగార్లాంటి చాలా తక్కువమంది ఎప్పటికీ అవుట్‌డేటెడ్ కారు. ఎందు కంటే వాళ్లు నిత్యం అప్‌డేట్ చేసుకునే మనుషులు.

నా విషయానికొస్తే కొన్ని కొన్ని సినిమా కథల విషయాల్లో అభిప్రాయబేధాలు రావొచ్చేమో. ఈయన విషయంలో అవుట్‌డేటెడ్ అన్న ఆలోచన ఎప్పటికీ రాదు నాకు.

ఎందుకంటే ఈ ఆనాటి వాన చినుకులు అనే ఎవరికీ రాని ఈ కొత్త ఆలోచన ఆయనకొచ్చింది మరి.

# Enjoy Araku Boomi Instant Coffee

- Arabica Beans from Araku Valley
- Award Winning Beans
- Quality Highly Ranked by Specialty Coffee Association
- No Chicory. 100% Pure Coffee
- Tastes like Filter Coffee

**Available at your local Indian stores.**

araku boomi instant coffee




wecare@boomicoffee.com
boomicoffee.com



## కొసరి పాటల కొసరాజు

కొసరాజు పేరు వినగానే రైతుజీవితదర్పణాలవంటి గేయాలు, తాత్వికగీతాలు, అజరామర హాస్యగీతాలు, ఇంకా వందలాది పల్లెటూరిపాటలు, జానపదగీతాలు, ప్రబోధగీతాలు సినీ సంగీత ప్రియులకు జ్ఞాపకానికి వస్తాయి.

కొసరాజు రాఘవయ్యగారిని తొలుత సినీరంగానికి తన 'రైతుబిడ్డ' సినిమా ద్వారా పరిచయం చేసినవారు గూడవల్లి రామబ్రహ్మంగారు. మలిప్రవేశం, చాలా కాలానికి 'పెద్దమనుషులు' సినిమాతో గానీ జరగలేదు.'పెద్ద మనుషులు', ఆ తర్వాత 'రాజూ పేద' పాటల విజయం, 'రోజులు మారాయి' సినిమాకు దారితీసాయి. 'రోజులు మారాయి' అఖండ విజయంతో కొసరాజు సినీరంగంలో స్థిరపడ్డారు.

మరో మూడు దశాబ్దాలపాటు, అంటే జీవించి వున్నంతకాలం ఆయన పాటలు వ్రాసినా ప్రథమార్థంలో ప్రధానంగా 1970 ప్రాంతాలవరకూ వచ్చిన కొసరాజు పాటలకు ఉన్న విస్తృతి, వైవిధ్యం, నైగనిగ్యం ఆయనను 'జానపద కవిసార్వభౌమ' బిరుదానికి అర్హుణ్ణి చేశాయి. ఆ పాటలలో మరికొన్నింటిని ఈ వ్యాసంలో చూద్దాం.

# విఠలాచార్య సినిమాలు

ఆమధ్య బాహుబలి మొదటి భాగం చూసిన ఒక మిత్రుడు 'ఆ! ఏవుంది. విఠలాచార్య సినిమా,' అని పెదవి విరిచాడు. అతని మాటలో బాహుబలి కన్నా విఠలాచార్య సినిమాలే నయం అన్న ధ్వని. చిన్నతనంలో విఠలాచార్య మార్క్ జానపదాలు చూసిన చాలామందికి అదే భావనకలిగి ఉంటుంది అంటే ఆశ్చర్యం లేదు.

ఒక్క బాహుబలే కాదు, లార్డ్ఆఫ్ ది రింగ్స్ , హేరీ పోటర్ సినిమాల్లో మాయలూ, మాంత్రికులూ ఇవన్నీ చూసినా తెలివిమీరిన తెలుగు ప్రేక్షకుడికి ఇవన్నీ మనం తీసి చూసి వదిలేసినవే, వాళ్లు ఇప్పుడు కళ్లు తెరిచారన్న చిన్నచూపు కొంతవరకూ ఉంటుంది.



కమలాకర కామేశ్వరరావును పౌరాణిక బ్రహ్మ అని గౌరవించిన తెలుగువారు, విఠలాచార్యను అప్యాయంగా జానపదబ్రహ్మ అన్నారు. ఈ బ్రహ్మ అన్న బిరుదు దర్శకుడైన కామేశ్వరరావుగారికన్నా దర్శకనిర్మాత అయిన విఠలాచార్యకు మరింత వర్తిస్తుందని అనుకోవడంలో తప్పులేదు.

కన్నడదేశంలోని ఉడిపి ప్రాంతానికి చెందిన విఠలాచార్య చిన్నతనంలో అయన అమ్మమ్మ చెప్పే అనేక జానపదగాథలను అత్యంతాసక్తితో వినేవారట. చదువు పెద్దగా అబ్బకపోయినా చిన్నతనంనుంచీ పుస్తకాలు బాగా చదివేవారు

(ప్రాచీన భారత జానపదగాథలేకాక, ఇతర దేశాలవి, చరిత్ర పుస్తకాలతో కూడిన చాలా పెద్ద లైబ్రరీ మద్రాసులో ఆయన దగ్గర ఉండేది. చందమామ కన్నడ, తెలుగు పుస్తకాల అన్ని బైండింగ్‌లు ఆయన దగ్గర ఉండేవి. తన సినిమాలకి కాస్ట్యూమ్‌లు, మేకప్ చందమామ బొమ్మల ఆధారంగా చేయించేవారట.)

తొమ్మిదేళ్ల వయసులో కథల్లోలాగా మజిలీలు చేసుకుంటూ ఉడిపికి నూటయాభై మైళ్ల దూరంలోని అరిసికరై అన్న ఊరికి కాలినడకన కట్టుబట్టలతో చేరుకుని అక్కడ హోటల్‌లో పనిచేస్తూ, నాటకాలు వేస్తూ, దగ్గరలోని తాలింఖానాలో సాము

గరిడీలు నేర్చుకుని, బహుమతులు సంపాదించే స్థాయికి చేరుకున్న విఠలాచార్య, కష్టపడే స్వభావం వల్లా, స్వతఃసిద్ధమైన తెలివితేటలవల్లా అంచెలంచెలుగా ఎదిగారు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని మూడు సార్లు జైలుకు వెళ్లివచ్చిన తర్వాత శంకర్ సింగ్ అనే మిత్రుడి ద్వారా సినిమా వ్యాపారం మీద దృష్టి సారించి, కొంతకాలం టూరింగ్ టాకీస్ నడిపి, క్రమంగా నిర్మాణంలోకి ప్రవేశించారు.

ఒకసారి అనుకున్న దర్శకుడు అలభ్యంగా ఉంటే అప్పటికే ఖచ్చితమైన పద్ధతుల్లో, సమయనియంత్రణతో సినిమావ్యాపారంలో ఉన్న విఠలాచార్య జాప్యాన్ని భరించలేక దర్శకత్వాన్ని కూడా చేపట్టాల్సి వచ్చింది.

అయినా ఆయనకు కన్నడసినిమా రంగం అనుకున్నంతగా కలిసిరాలేదు. ఆరోజుల్లో కన్నడ ప్రాంతాల్లో కూడా తెలుగు, తమిళ చిత్రాల జోరు నడిచేది. వాటిలో కూడా ప్రత్యేకించి జానపదాలకు జనంలో ఉన్న ఆదరణ ఆయన గమనించారు. ఆయనకు దైవభక్తి, జ్యోతిషం మీద నమ్మకం ఎక్కువగా ఉండేవి. ఒక జ్యోతిష్కుడు పరభాషా చిత్రాల మీద లాభాలు వస్తాయని చెప్పాడట.

అలా విఠలాచార్య తెలుగు చిత్రరంగంలో ప్రవేశించి కన్యాదానం (1955), వద్దంటే పెళ్లి (1957) సినిమాలు తీసినా అవి పెద్దగా ఆడలేదు. కలిసొచ్చిన, మనసుకు నచ్చిన జానపదాలతోనే తొలివిజయం జయవిజయ (1959) సినిమాతో అందుకున్నారు.

ఆసరికి తెలుగులో గొప్ప జానపదాలు వచ్చి వున్నా చిన్నబడ్జెట్‌లతో, తక్కువ సమయంలో వరుసగా విజయవంతమైన జానపదాలు తీయడం విఠలాచార్యతోనే మొదలైంది. మాయలు, మంత్రాలు, కుట్రలు, కుతంత్రాలు, మైమరపించే సెట్లు, మరపురాని సంగీతం, నృత్యాలు, హాస్యసన్నివేశాలు, కత్తియుద్ధాలు, అశ్వారూఢుల సాహసాలు ఇవన్నీ ప్రేక్షకులను ఏవేవో లోకాలకు తీసుకెళ్లేవి. జానపదనాయకుడిగా అప్పట్లో కాంతారావును ప్రతిష్ఠించింది విఠలాచార్యే.

బందిపోటు (1963)తో మొదలైన ఎన్టీ రామారావు-విఠలాచార్య సూపర్ హిట్ సినిమాలు ఎన్టీఆర్ అభిమానులు ఇప్పటికీ ఆనందంగా గుర్తుచేసుకుంటారు (బందిపోటు సినిమాకు కొసరాజు రచించిన ఓ అంటే తెలియని ఓ దేవయ్యా... పాట ఇంతకు మునుపు చూసాం).

అప్పట్లో విమర్శకులు, సమీక్షకులు తన సినిమాలు మెచ్చకపోయినా విఠలాచార్యకు పట్టింపు ఉండేదికాదు. సగటు ప్రేక్షకుడు తన సినిమాల నుండి ఏం కోరుకునేవాడో అవే ఆయన సినిమాల్లో వుండేవి. పొరపాటున ఆయన రూటు మారితే ప్రేక్షకులు ఊరుకునే వారుకాదు.

జానపదాలకు ఆదరణ క్రమంగా తగ్గిపోయిన డెబ్భైయ్యవ దశకం చివరికొచ్చేసరికి విఠలాచార్య సినిమాలు పెద్దగా ఆడని పరిస్థితి నెలకొని ఉంది. ఆ రోజుల్లో రామారావు అడవిరాముడు (1977) సినిమా అఖండ విజయంతో కొత్త జోరు అందుకున్న తర్వాత కూడా ఆయన ఇతర దర్శకులతో చేసిన జానపదాలు సింహబలుడు (1978), రాజపుత్ర రహస్యం (1978) పెద్దగా ఆడలేదు. అయినా అదే సంవత్సరం పెద్ద తారలు లేకుండా జయమాలిని ప్రధానపాత్రగా జగన్మోహిని తీసి ఘనవిజయం సాధించి మరోసారి అదే చివరిసారి కూడా - జానపదబ్రహ్మ అన్న బిరుదు సార్థకం చేసుకున్నారు విఠలాచార్య.

## 2




విఠలాచార్య సినిమాలలో కొసరాజు పాటలు ఆయన తొలిచిత్రం కన్యాదానం నుండి రెండు దశాబ్దాలపాటు వచ్చాయి. హాస్య గీతాలేగాక వైవిధ్యభరితమైనవీ తమాషా అయినవీ కూడా వీటిలో ఉన్నాయి.

కన్యాదానంలో కొసరాజు వ్రాసిన మూడు పాటలలో 'ఓరి ఓరి తెలుగువాడ ఒయ్యారీ తెలుగువాడ దేశమంటే తెలుసుకోరా తెలివిగల్గి మేలుకోరా...',



అయ్యయ్యయ్యా, ఐసా, పైసా చల్తారే
అబ్బబ్బబ్బా, అల్లీ బిల్లీ బోల్తారే
ఆహా చల్తారే - ఆహా బోల్తారే
జోరు జోరు హై - తీరు తీరు హై
ఝణక ఝణక ఝంపా ॥అయ్య॥

ఆహా! ఊహు, ఆషామాషీ
నకనక నకిలీ వేషం
జిల్‌జిల్లా పాటా - జిగేలు ఆటా
చికి చికి చికిలీ మోసం
జాహెరే! లాహెరే! బాపురే
ధిగిరి ధిగిరి ధిగిరా-రా-రా ॥అయ్య॥

చల్ చల్ ఘోడా చలాకి ఘోడా
ఛెడేలు చంకీ కొరడా
కిలకిల నేస్తా కిలాడి నేస్తా
వాహ్వా వుల్టా సీదా
అస్తురే మస్తురే దోస్తీరే
ధిగిరి ధిగిరి ధిగిరా-రా-రా
సై సై సైరబ్బా బే బే బే రుబ్బా
సైరుబ్బా బే రుబ్బా ఓ రుబ్బా ॥అయ్య॥

'వన్నియలోలేదు విలువ కన్నియ గుణమే కను చలువ..." వంటి ప్రబోధగీతాలు ఉన్నాయి.

ఆ సినిమా నుండి ఓ పది సంవత్సరాలు ముందు కొచ్చి డీవియస్ ప్రొడక్షన్స్‌వారు నిర్మించిన మంగమ్మ శపథం (1965) చూద్దాం. ఇందులో అన్ని పాటలూ బాగుంటాయి (సంగీతం టీవీ రాజు).

మంగమ్మ (జమున), విషయలోలుడైన రాజును (రామారావు) ధిక్కరించి అతని ఆగ్రహానికి గురౌతుంది. ఆమెను పంతానికి బలవంతంగా వివాహమాడి కారాగారంలో బంధిస్తాడు రాజు.

ఆమె అక్కడి నుంచి తప్పించుకుని విచిత్రమైన భాషమాట్లాడే ఒక దొమ్మరికన్నె వేషంలో అతని వద్దకే వెళ్లి నృత్యం చేసే సన్నివేశానికి కొసరాజు 'అయ్య య్యయ్య ఐసా పైసా చల్తారే,' అనే తమాషా మాటల పాట వ్రాసారు.

తెలుగు మాటలు, హిందీ మాటలు, మాటల లాంటి శబ్దాలు కలగలిపి వండిన వింత వంటకం లాంటి ఈ పాటలో సందర్భానికి తగ్గ నకనకనకిలీ వేషం, చికిచికిచికిలీ మోసం వంటి ప్రయోగాలు, అస్తు మస్తు దోస్తీ, ఉల్టాసీదా, అల్లీ బిల్లీ బోల్తా అనడంలో రాజు తన వలలో పడ్డాడని సూచనలు, కొరడా అన్న



చిరునవ్వు లూరించు చిన్ని అబ్బాయీ
కన్నవారికి పేరు దేవోయీ
పక్కనున్న వారికి పేరు దేవోయీ
పెంచుకొన్నవారికి పేరు దేవోయీ
చదువు సాముల్లోన చాకచక్యము మించి
దేశాల ఖ్యాతితో వెలగాలీ
పంతులయ్యకు పెద్ద పంగనామము వేసి
బాజార్లు పట్టుకుని తిరగాలీ
మామ పోలిక నీకు కలగాలీ ॥చిరు॥

భరతపుత్రుని రీతి బరి మీద పులినైన
ఎదిరించి అదలించి నిలవాలీ
నాగాలాపురికాడ నక్క ఎదురుగ వస్తే
తిరుమలాపురి దౌడు తియ్యాలి
తిన్నదంతా బాగా అరగాలీ ॥చిరు॥

తల్లి శపథమ్మునూ చెల్లించు సుతుడవై
పోటు బంటని జనులు పొగడాలీ
అబ్బనైనా వాడి అబ్బనైనా సరే
దెబ్బ మీద దెబ్బ తీయాలి
మాటలే కోటలూ దాటాలి ॥చిరు॥

మాటలో కూడా ఆమె చేసిన శపథం గుర్తు చేసుకోవడం చూడవచ్చు. పి. సుశీల బాగానే పాడినా జిక్కీ, జమునా రాణి, జానకి వంటి స్వతంత్ర వ్యక్తిత్వం ఉన్న స్వరాల్లో ఈ పాట ఇంకా రాణించేదేమోననిపిస్తుంది.


పై పాట ద్వారా భర్తకు దగ్గరై తత్ఫలితంగా ఒక బిడ్డకు తల్లి అయిన మంగమ్మ, కొడుకు ప్రయోజకుడై తన శపథాన్ని నెరవేర్చాలని కోరుకుంటూ పాడుకునే 'చిరునవ్వులూరించు చిన్ని అబ్బాయీ...' చాలా చక్కని పాట.

ఇందులో మంగమ్మ అన్నావదినలు (మాధవ పెద్ది, స్వర్ణలత గాత్రాలతో రేలంగి గిరిజ) కూడా పాల్గొంటారు. ఎవరు ఏమి పాడివుంటారో సాహిత్యం చూస్తే చాలు అర్థమవుతుంది. కన్నవారికి, పక్కనున్న వారికి, పెంచుకున్నవారికి అంటూ ముగ్గురూ అతడిని ముద్దు చేయడం చూడండి. ఆప్యాయత, వినోదం, హాస్యం అన్నీ ఉండేలా ఈ పాట వ్రాసారు కొసరాజు.

ఇవిగాక మంగమ్మ శపథం సినిమా కోసం, 'ఆ ఊరు నీదిగాదు ఈ ఊరు నాదికాదు,' అనే హుషారైన హాస్యగీతం కూడా వ్రాసారు కొసరాజు.

## 3

1966లో శ్రీ విఠల్ ప్రొడక్షన్స్ పతాకంపై విఠలాచార్య నిర్మించి, దర్శకత్వం వహించిన అగ్గిబరాటా సినిమాలో రెండు కొసరాజు గీతాలున్నాయి. రెండూ కథానాయకుడు (రామారావు) విలన్లను బోల్తా కొట్టించడానికి మారువేషాలు వేసుకొచ్చి పాడే పాటలే. అసలులో కొసరులాంటి ఇటువంటి వేషాలు ఎన్టీఆర్ బాగా ఇష్టపడేవారనీ, అడిగి పెట్టించుకునేవారనీ చెప్తారు. విఠలాచార్య సినిమాల ఫార్ములాలో ఇవి కూడా జనరంజకమైన దినుసులు.




వీటిలో మొదటిది అమ్మోరిని అట్టహాసంగా తీసుకొచ్చిన గణాచారి వేషం. ఈ సన్నివేశం కోసం వ్రాసిన 'మల్లేలమ్మా మల్లేలోయ్ మల్లేలోయ్ మల్లేలా...' అన్న పాట చూడండి.

ఈ పాటకు కొసరాజు వాడిన సిసలైన యాస బాసలోని సొగసు ఇట్టదేవతలు, కట్టాలు రాకుండా, కల్లువారాబోయింతానే కల్లువారాబోయింతా, మొ- ప్రత్యేకంగా గమనించదగ్గది. ఆ దేవత (పాట సందర్భంలో బందీగా ఉన్న రాకుమారి కూడా) కల్మషం లేని వాళ్లని చెప్పడానికి సుద్దివేసిన బుద్ధి అన్నమాట చూడండి. కావళ్లలో కోళ్లు, గండదీపం (నెత్తిమీద పెట్టు



*కలో జాగో! ఓ మారెమ్మ, మాంకాళమ్మ, సోమాలమ్మ*
*సుబ్బమ్మ, సోవమ్మ, ఎల్లమ్మ, పుల్లమ్మ*
*ఊరుని సల్లంగ సూసిన నా యిట్ట దేవతలారా! ॥నా॥*
*పెజలకి ఏ కట్టాలు రాకుండ సూడండి అమ్మలారో*

*మల్లేలమ్మా మల్లేలోయ్ మల్లేలా మల్లేలా*
*మా అమ్మా సత్తిం సూడండోయ్-మల్లేలోయ్ మల్లేలా*
*మా తల్లి సత్తిం సూడండోయ్-మల్లేలోయ్ మల్లేలా*


*పిల్లజెల్లల సల్లగసూత్తే-కావిడికోళ్లు గండదీపము*
*కల్లు వారపోయిత్తారా*
*మా తల్లి సత్తిం సూడండోయ్ ॥మల్లే॥*

*సభవారూ సూడంగా! ఏలినవారు మెచ్చంగా!*
*నా గాజులు గలగల్లాడించు*
*సుద్దివేసిన బుద్ధిగల మా తల్లోయ్ మల్లేలా*
*గద్దెపై గూర్చున్న ఓ పెద్దమ్మోయ్! ॥మల్లే॥*
*నీ గది గుమ్మం దగ్గరున్న*
*తెర తప్పించి నీ ముఖం చూపించమ్మా మల్లేలా మల్లేలా*

కుని ప్రదక్షిణలు చేస్తూ తిరిగే దీపం), కల్లు మొదలైన అమ్మోరి నైవేద్యాలు ఒకప్పుడు ఉండేవని ఇటువంటి పాటల వల్ల మనకు తెలుస్తుంది. ఇంత ప్రత్యేకమైన సాహిత్యాన్ని ఘంటసాల పాడిన విధానం తరవాతి తరాల గాయకులకు శిరోధార్యం.

ఇదిగాక నాట్యంచేసే గుర్రం పాట 'చం చం గుర్రం చలాకి గుర్రం' కూడా కొసరాజు వ్రాసారు. ఈ పాట కూడా (విజయా కృష్ణమూర్తి స్వరకల్పనలో) చలాకీగా ఉంటుంది.

**4**



మంగమ్మ శపథం విజయం తరవాత, 1966లో నిర్మాత డీవియస్ రాజు డీవియస్ ప్రొడక్షన్స్ పతాకం పై విఠలాచార్య దర్శకత్వం లో నిర్మించిన మరో విజయవంతమైన జానపదం పిడుగు రాముడు.

ఇందులో ఎల్ విజయలక్ష్మిది కాలప్రభావం వల్ల అడవిలో పెరిగి పెద్దదయిన రాజోద్యోగి కూతురు 'ఛాయ' పాత్ర. ఈడు వచ్చి తోడుకోసం కలలుకంటూ ఆమె పాడుకునే పాట 'కొమ్మల్లో పాలపిట్టా కూత కూసిందోయ్'.

వనసీమల్లో కానవచ్చే పాలపిట్టకూత, గున్నమావి కాపు, చిలిపిగాలి, వలపు వాన, మొయిలు నాట్యాలు, పూలతావి మొదలైన వాటిని ఆమె లోని ప్రణయాంకురానికి దోహదకారులుగా, ప్రతీకలుగా చూపిస్తూ మనోహరంగా కొసరాజు ఈ పాట వ్రాసారు. రాజ మకుటంలోని కొసరాజు






*కొమ్మల్లో పాలపిట్టా కూత కూసిందోయ్*
*కమ్మంగా గున్నమావి కాపు కాసిందోయ్*
*రాజా - రాజా - నా రాజా!*

*చిలిపిగాలి విసిరెనులే వలపువాన కురిసెనులే రాజా*
*గిలిగింతలు కలిగెనులే ఘూమా ఘూమాలే*
*ఈ గాలిలో ఈ వేళలో ఏవేవో తలపులు*
*చిగురించెనులే ॥కొమ్మ॥*

*పైరు పాట పాడిందీ*
*మొయిలు నాట్యమాడిందీ రాజా*
*పూలతావి మత్తుజల్లి లాలించిందీ*
*పదే పదే అదేమిటో*
*నా ఒళ్లు పరవశమయిపోయినదీ ॥కొమ్మ॥*

*పక్క నెవరో పిలిచినట్టు*
*పైటకొంగు లాగినట్టు*
*ఏమేమో అనిపించును రాజా*
*ఔనౌనులే సిగ్గౌనులే*
*వయసున చెలరేగిన భ్రమలివిలే ॥కొమ్మ॥*

అద్భుతగీతం 'ఏడనునాడో ఎక్కడున్నాడో'ను తలపిస్తుంది ఈ గీతం. ఆయనకు అరుదుగా లభించే ఇంత అందమైన పాటలో కూడా కొసరాజు కలం స్వభావోక్తిని దాటదు.

పోలికకు ఈ పాటతర్వాత ఇదే మోస్తరులో ఛాయ పాడుకునే మరో పాట, సినారె వ్రాసినది, 'మిలమిల మిలమిల మెరిసే మనసే ఎగసి దూకిందిలే' సాహిత్యంలోని ఉత్ప్రేక్ష గమనించవచ్చు. టీవీరాజు కూర్చిన చక్కని సంగీతం, సుశీల కోకిలగానం కొమ్మల్లో పాలాపిట్టా పాటకు అదనపు ఆకర్షణలు.

కథానాయకుని స్నేహితుడు సివంగి (పద్మనాభం) అపాయం నుంచి తప్పించుకుని పారిపోతూ అడవిలో ఒక గూడెంలో చొరబడి ఆ గూడెం దొర కూతురు సింగి (వాణిశ్రీ) జోడుకోసం పూజ చేస్తుంటే, అకలేసి ఆ పూజలోనూ ప్రసాదంలోనూ పాలుపంచు

కుంటాడు. దాంతో ఆమెకు అతనే జోడు అని నిశ్చయించి వారి ఆచారం ప్రకారం బలవంతంగా అతనికి ఆమెతో పెళ్లి చేస్తారు. మెల్లగా తప్పించుకుని పోతున్న సివంగిని కనిపెట్టి సింగి పట్టుకున్న సన్నివేశానికి కొసరాజు వ్రాసిన హాస్యగీతం 'నిండు అమాస నిశిరేత్తిరికడ'.

ఇద్దరూ అడవిలో పెరిగినవారే అయినా, తోడు కోసం జోడుకోసం ఎదురుచూపులో ఉన్నవారే అయినా,

నిండు అమాసా నిశిరేత్తిరి కడ
ఎక్కడి కెళ్తవు మామో నువ్వేమైపోతావు మామో

ఎటుబోతేనేం ఏమయితేనేం
వెంటబడకు ఓ భామో నన్నేడిపించకో భామో

కళ్లలో కారంగొట్టి పోతివా
కంతిరిజేసి దాటిపోతివా
కాలికి మెడకూ కట్టేస్తానోయ్
నెత్తిన రెండూ మొట్టేస్తానోయ్ ॥నిండు॥

చూపులు చూస్తే ఊపుగ వున్నాయి
మాటలు చూస్తే జోరుగ వున్నాయి
పోచుకోలుగా తలచేవేమో
మీసమున్న మగధీరుడ నేనే ॥నిండు॥

జెట్టా పట్టా జానెడు లేవూ ఉల్లిపాయవలె ఎగిరిపడేవూ
ఉల్లిపాయలో వున్నది కారం
రుగవు ఏమో నా వ్యవహారం ॥ఎటు॥

గడప దాటి నువు కాలి బెడితివా
ఒళ్లు సాపుగా ఊపేస్తాన్
గ్రహపాటున నే నిక్కడికొస్తే
కదలనీయదూ యీ సైతాన్ ॥నిండు॥



వేర్వేరు నేపథ్యాల నుండి వచ్చిన పదుచులు ఛాయ, సింగి పాత్రలకు కొసరాజు వ్రాసిన మాటలు, అభివ్యక్తులలో వైవిధ్యం, ఔచిత్యం చూడండి.

5

జానపదాలలో చాలాసార్లు సిపాయిల మధ్య, వాళ్ల డేరాల వద్ద, రాత్రిపూట కాగడాల వెలుగులో చిత్రించబడిన పాటలుంటాయి. జయసింహలో సముద్రాల జూనియర్ వ్రాసిన 'కొండమీద కొక్కిరాయి' ఈ కోవలో చెప్పుకోదగినది. అలాగే రాజమకుటంలోని ఏటి ఒడ్డునా మా ఊరూ, రాణీ రత్నప్రభ లోని నీటైన పడుచున్నదోయి వంటి మంచి కొసరాజు పాటలు ఇంతకుముందు చూసాం. పైన చెప్పుకున్న 'మల్లేలమ్మా మల్లేలోయ్ మల్లేలోయ్ మల్లేలా' కూడా సైనికుల మధ్యే జరుగుతుంది.




కొసరాజు, డీవియస్ రాజు, టీవీరాజు, విఠలాచార్య భాగస్వామ్యంలో వచ్చిన మరో ప్రసిద్ధ సిపాయి పాట 'వయ్యారి భయ్యారి అందాలబొమ్మా వచ్చిందోయ్'. సినిమా గండికోట రహస్యం (1969) అని వేరే చెప్పక్కరలేదు.

హిందీ సినిమా మధుమతి (1958)లో సలీల్ చౌధురి చేసిన సూపర్ హిట్ పాట 'దైయ్యారె దైయ్యారె చఢ్ గయొ పాపీ బిఛువా' వరసను యథాతథంగా ఇందులో వాడుకున్నారనేది ఆ తరం సంగీతాభిమానులకు తెలిసిన విషయమే. అందులో వైజయంతిమాల చేస్తే ఆమె వారసురాలిలాంటి జయలలిత మీద తెలుగుపాట చిత్రీకరించబడింది.



లాహిరి లాహిరి లాహిరి మజమజ లలల్లా లాహిరే ॥మ॥

ఓ హాయిరే హాయ్ - ఓ ధీరా ఓ వీరా రావేరా
హే వయ్యారి భయ్యారి అందాలబొమ్మా వచ్చిందోయ్
హే అయ్యారే వయ్యారి ముద్దులగుమ్మా వచ్చిందోయ్
చక్కనిచుక్కా వచ్చిందా వచ్చిందా -
చక్కనిచుక్క వచ్చిందా వచ్చిందా
ఓ హాయిరే... హాయి పిలిచినదోయీ బుల్‌బుల్ ప్యారీ
పిలిచచినదోయీ బుల్‌బుల్ ప్యారీ
వలచినదోయీ నిన్నే కోరి
వలచినదోయీ నిన్నే కోరి - సైరా నా రాజ హాయ్
సైరా నా రాజ, వుందిల్ బల్ మజా
రాజ నిమ్మలపండు రమ్మన్నదీ
హే... జాహిరి జాహిరి జాహిరి జమా జమా జమా
జగ జగ జగ జాహిరే - ఆ!
చీకటిగుహాలో సింహము వుందీ ॥చీకటి॥
చిక్కనని వలలో చిక్కినదోయీ ॥చిక్క॥
ఓయీ మొనగాడా ఓయీ జతగాడా
సమయం చూచీ గర్జనచేసి దూకిపోతున్నదీ హే...

బిమల్‌రాయ్ తీసిన కళాఖండంలో లతా మంగేష్కర్, మన్నాడే పాడిన క్లాసిక్ పాటను కాపీ కొట్టటమేగాక, విఠలాచార్య తాలూకు మాస్ ముద్రకు తగ్గట్టు వాద్యగోష్ఠిని పెంచి, నృత్యగతిని ఉధృతం చేసి తీసిన వయ్యారిభయ్యారి పాటను లెక్కలోకి నిజానికి తీసుకోకూడదు.

అయినా వయ్యారిభయ్యారి పాట గుర్తుండి పోవటానికి మూడు కారణాలున్నాయి.

ఈ పాటకు తగ్గట్టు కొసరాజు కలం కదను తొక్కిన పద్ధతి, ఆయనకే సాధ్యమైన మాటల చిలికింత ఒకటి. భయ్యాను వయ్యారినీ కలిపి భయ్యారి అన్న మాట Fraternal అన్న అర్థంలో కొసరాజు సృష్టించి ఉంటారు. రెండవది మంచి ఎనర్జీతో సుశీల పాడిన విధం. మూడు జయలలిత కదలికల్లోని అందం, వేగం.




ఏమయా రామయా ఇలా రావయా
ఒక్కసారి నిన్ను జూస్తె వదలలేమయా
పేరుబడ్డ మీసం పులిబిడ్డలాంటి వేషం
నీకు నీవె సాటిలే నిల్పలేను మోహం
మనలోని మాటలే మనకేమి చాటులే
వయ్యారిభామలోయ్ వరసైతె చూడహోయ్

అహ - ఒహో
నీకు మాకు జోడు పరాకు లేక చూడు
మాట మంతి కనిపెట్టి మసలకుంటె కీడు
గుట్టు తెలుసుకోవయా గట్టి ఘటము లేవయా
సులువు చూసుకోవయో దారిదొరకు మావయో-

అహ - ఒహో
సత్తువైన పిల్లా చురకత్తిలాంటి పిల్లా

మేఘడలోన వుండదగ్గ మెరుపులాంటి పిల్లా
వలచేను లేవయా కులికేను రావయా
అద్దంలో నీడయో అందితే చూడయో



కొసరాజు వ్రాసిన సిపాయిపాటల్లో (తెలుగు సైనికులతో పాటు తురుష్క పరాసుమూకల మధ్య జరిగే) గొప్ప పాట బొబ్బిలియుద్ధం (1964)లోని 'ఏమయా రామయా' ఈ సందర్భంగా చెప్పుకుని తీరాలి.

స్వరరాజేశ్వరరావు చక్కని వరసలో, దీటైన కొసరాజు సాహిత్యాన్ని, స్వర్ణలత, వసంత కర్ణపేయంగా పాడిన ఈ పాటకు- బొబ్బిలికోట ముట్టడిని తాండ్ర పాపారాయునికి తెలియజేయడానికి ప్రాణాలకు తెగించి గొల్లపడుచులు చేసే సాహసం వల్ల- ఈ కోవ లోని మిగతాపాటలకు లేని బరువు, విలువ కూడా ఉన్నాయి.

అన్నట్టు గండికోట రహస్యంలో కొసరాజు నల్లేరు పై బండినడకలా వ్రాసిన హాస్యగీతం 'తగులుకుంటే వదలడేమి ముసలిమామా' కూడా ఉంది.

## 6




విఠలాచార్య జానపదాలలో మాయలు, మంత్రాలు లేకపోయిన సందర్భాలలో కూడా అవి ఎక్కువగానే జనాదరణకు పాత్రమయ్యేవి. ఇందులోనిఒక రహస్యం ఆయన ఎంచుకున్న కథలకున్న సహజమైన ప్రసిద్ధి, ఆకర్షణ.

రాబిన్‌హుడ్ కథలకు దగ్గరగా ఉండే బంది పోటు, అలెగ్జాండర్ డ్యూమా నవల 'కోర్సికన్ బ్రదర్స్' అధారంగా అగ్గి పిడుగు, మన జానపదగాథల్లోంచి తీసుకుని అనేకసార్లు సినిమాగా వచ్చిన మంగమ్మ శపథం, మరో యూరప్ సాహసగాథ ప్రిజనరాఫ్ జెండా ఆధారంగా *గండికోట రహస్యం*, ఈ వరసలో అరేబియన్ రాత్రుల కథల ఆధారంగా 1970లో



అల్లా యా అల్లా, అల్లా యా అల్లా
మనిషి మనిషికి రకరకాలుగా
నశీబు రాస్తావేమయ్యా తమాష చూస్తావేమయ్యా ॥అల్లా॥

ఒక్కడిని బిక్కాఫకీర్ను చేసి
ఒక్కడిని పక్కావజీర్ను చేసి
తెరపై ఆడిస్తుంటావ్ తిమ్మిని బొమ్మిని చేస్తావ్!
భార్యను గయ్యాళిగ సృష్టించి
భర్తను దద్దమ్మగ పుట్టించి
గారడి చేస్తావేమయ్యా! యా అల్లా
గమ్మత్తు చూస్తావేమయ్యా ॥అల్లా॥

కండాగుండే వుండేవాడికి
బుర్ర తక్కువగ యిస్తావు
కలేజలేని పిరికిపందకూ అతి
తెలివిని జతచేస్తావ్! నశీబు
మారకపొయ్యేనా... నా నశీబు
మారకపొయ్యేనా - ఆ నవాబు
దర్జా రాకుండేనా - గులాములంతా
చుట్టూ చేరి సలామంటే నే చూడనా ॥అల్లా॥

విఠలాచార్య దర్శకత్వం వహించిన శ్రీ గౌతమ్ పిక్చర్స్ వారి ఆలీబాబా *40* దొంగలును కూడా కలుపుకోవచ్చు.

విఠలాచార్య సినిమాలలో మొదట్లో రాజన్-నాగేంద్ర, తరవాత టీవీ రాజు, విజయా కృష్ణమూర్తి, కోదండపాణి ఎక్కువగా సంగీతం చేసినట్టు కనబడుతుంది. అయితే ఘంటసాల చేసిన బందిపోటు, ఆలీబాబా *40* దొంగలు, విజయం మనదే సినిమాల సంగీతం ధీరగాంభీర్యంతో ఆయన ప్రతిభను ప్రత్యేకతనూ చాటుతూనే ఉంటుంది.



*లేలో దిల్ బహార్! అత్తర్*
*దునియా మస్తానా... అత్తర్*
*లేలోబాయ్ దేఖోబాయ్*
*లేలో దిల్ బహార్ అత్తర్*
*దునియా మస్తానా అత్తర్*
*ఒక్కసారి రాసి చూస్తే గుం గుం గుం ఘుమార్!*

*గులాబీలు కుమ్మరించి, మల్లెపూలు మొలాయించి*
*వట్టివేళ్లు కొట్టిపోసి సువాసనల్ జమాయించి*
*తాజాగా తెచ్చామండి! అడిగితేనే యిస్తామండి ॥లేలో॥*

*బడా బడా పాదుషాలకు ఖుషీదెచ్చు అత్తరిదీ*
*గొప్ప గొప్ప సర్దారులకు మొహబత్తును యిచ్చునది*
*ముసలివాళ్లకైనా వాహ్వా దసరాపండుగ చేస్తుందీ ॥లేలో॥*

*మొగవాడంటేనే అబ్బో*
*ఎగిరిపడే బుల్లెమ్మాయీ! దీని మజా*
*తగలంగానే చూస్కోరా మేరా భాయీ*
*మొగుడో... మొగుడో మొగుడో అంటూ*
*ఎగబడి వస్తుంది! హాయ్! హాయ్! ॥లేలో॥*

ఆలీబాబా *40* దొంగలు సినిమా కోసం కొసరాజు మూడు పాటలు వ్రాసారు. ఆలీబాబా కట్టెల కోసం - దొంగలగుహ వైపు తెలియకుండా వెళుతూ పాడుకునే పాట 'అల్లా యా అల్లా.'

ఉర్దూలో కూడా పండితుడైన సి నారాయణరెడ్డి అక్కడే ఉన్నప్పటికీ ఈ పాట కొసరాజుతో వ్రాయించడం ఒక విశేషం. బుక్కాఫకీరు అంటే ఆకలితో అలమటించే పేద. అదేకాక నశీబ్, కలేజా, గులాంలాంటి ఉర్దూ మాటలతో మధ్య ప్రాచ్య వాతావరణాన్ని తీసుకొచ్చారు కొసరాజు. చిన్నప్పుడు మా ఊళ్లో తాపీపని చేసేవారు (మస్తాన్, రహంతుల్లా ముఠావారు), అన్నగారి వీరాభిమానులు, ఈ పాట తెగ పాడుతుండేవారు.

కొసరాజు పేకాట, సిగిరెట్టు, టోపీ, మందు, తాయెత్తు వంటి రోజువారి వస్తువులపై జనరంజకమైన పాటలు వ్రాయడంలో నేర్పరి అని మనకు తెలుసు. ఆ కోవ లోదే 'లేలో దిల్ బహార్ అత్తర్'

ఇదికూడా ఘంటసాల స్వరపరచి స్వయంగా పాడిన పాట. దొంగల నాయకుడు (కైకాల సత్యనారాయణ) ఆలీబాబా ఇంటిని కనిపెట్టడానికి అత్తరు సాయిబు వేషంలో వచ్చి పాడే గొప్ప పాట. ఇందులో ఉర్దూ పదాల మేళవింపు అత్తరులో గులాబీలు, మల్లెల మేళవింపులాగానె అందంగా చేసారు కొసరాజు. మొదటి చరణంలో తయారుచేసే విధానం, రెండో చరణంలో ఎంత గొప్పవాళ్లు వాడతారు, మూడవ చరణంలో కొంటే జరిగే మేలు, ఒక తర్కబద్ధమైన క్రమంలో కొసరాజు వ్రాసారు. సినిమా చూసినప్పుడు ఇది జాగ్రత్తగా వింటేగానీ ఘంటసాల పాడారని తెలియదు. ఆసరికి వయసు మీద పడుతున్నా ఆయన సాధించిన 'పాత్రకాయప్రవేశం' అమోఘమే. చివర్లో మొగుడో మొగుడో అని ఎలుగెత్తడం చూడండి.

'చలాకైన చిన్నదీ భలే భలేగున్నదీ' అనే మరో పాట కూడా కొసరాజు ఈ సినిమా కోసం వ్రాసారు.

ఇంకా కదలడు-వదలడు, లక్ష్మీకటాక్షం, విజయం మనదే వంటి విఠలాచార్య సినిమాల్లో కొసరాజు పాటలున్నాయి.

ఇంతటితో విఠలాచార్య సినిమాల ప్రస్తావన చాలించి మరికొన్ని పాటలతో మళ్లీ కలుద్దాం.

(సశేషం)

శ్రీ అట్లూరి & జలపతి

# ఎప్పటికప్పుడు కొత్త బ్యాచ్... నటవారసులదే మ్యాచ్!

పెళ్లిసందడి సరిగ్గా పాతికేళ్ల క్రితం విడుదలైంది. 2021లో మళ్లీ పెళ్లి సందD మొదలు. ఈసారి *'D'* ఒక్కటే మార్పు కాదు. హీరో కూడా వారసుడు. ఎవరి అండదండలు లేకుండా తన టాలెంట్‌ని నమ్ముకొని సినిమారంగంలోకి అడుగుపెట్టిన శ్రీకాంత్ పెళ్లి సందడి సినిమాతో స్టార్ అయ్యారు. ఇప్పుడు ఈ కొత్త వర్షన్‌లో హీరో ఆయన వారసుడు. శ్రీకాంత్ కుమారుడు రోషన్ ఇప్పటికే టీనేజ్ స్టార్‌గా పరిచయం అయ్యాడు. అయితే, అసలు సిసలు హీరోగా పెళ్లి సందD సినిమాతో పరిచయం అవుతున్నాడు.

దగ్గుబాటి వెంకటేష్, దగ్గుబాటి సురేష్‌బాబుల మరో వారసుడు కూడా వస్తున్నాడు. రానా చిన్న తమ్ముడు చాలా ఏళ్ల నుంచి హీరో అవునంటూ చెప్తూ వచ్చారు. అది ఇప్పుడు సాధ్యమైంది. తేజ దర్శకత్వంలో రూపొందుతోన్న కొత్త చిత్రంలో దగ్గుబాటి అభిరామ్ హీరోగా పరిచయం కానున్నాడు. ఈ సినిమా





షూటింగ్ జరుగుతోంది.

దిల్ సినిమాతో తెలుగు సినిమా నిర్మాతగా జెండా పాతిన దిల్ రాజు ఇప్పుడు భారతీయ చలన చిత్రసీమలో అగ్ర నిర్మాతగా వెలుగొందుతున్నారు. ఆయన కుటుంబం నుంచి ఆశిష్ హీరోగా పరిచయం అవుతున్నాడు. దిల్ రాజు సోదరుడు శిరీష్ కొడుకు ఆశిష్ రౌడీ బాయ్స్ అనే సినిమాతో రంగప్రవేశం చేస్తున్నాడు . దసరాకి విడుదల కానుంది ఈ సినిమా.


మహేష్‌బాబు కుటుంబం నుంచి మరో నటుడు వస్తున్నాడు. మహేష్‌బాబు సోదరి కొడుకు గల్లా అశోక్ హీరోగా ఎంట్రీ ఇస్తున్నాడు. షూటింగ్ పూర్తి అయింది. సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది.


మోక్షజ్ఞ ఎంట్రీకి అంతా సిద్ధమే. నందమూరి ఇంటి నుంచి వారసుల రాక ఇటీవల కొంత తగ్గింది. బాలకృష్ణ కుమారుడు మోక్షజ్ఞని పరిచయం చెయ్యాలని చాలాకాలంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. 2022లో అది సాధ్యమయ్యేలా ఉంది. రవితేజ కుమారుడు మహాధన్ కూడా కథానాయకుడిగా అడుగుపెట్టేందుకు సిద్ధమవుతున్నాడు.

పవన్‌కళ్యాణ్ కుమారుడు అకీరా, మహేష్ బాబు కుమారుడు గౌతమ్ కూడా మరో రెండు, మూడేళ్లల్లో హీరోలుగా అడుగుపెడతారు. ఇప్పటికే అభిమానులు వారి అరంగేట్రం కోసం సోషల్ మీడియాలో హ్యాష్టాగ్‌లతో హోరెత్తిస్తున్నారు. అకీరా ఇప్పటికే నటుడికి కావాల్సిన అంశాల్లో శిక్షణ తీసుకుంటున్నాడు. గౌతమ్ ఘట్టమనేని బాలనటుడిగా పరిచయం అయ్యాడు. చదువు పూర్తి కాగానే నేరుగా సినిమారంగంలోకే.

### అబ్బాయిలతో పాటు అమ్మాయిలు

నట వారసులు అంటే అబ్బాయిలే కాదు అమ్మాయిలు కూడా ఉంటారు. హీరోలు, దర్శకుల కూతుళ్లు కూడా రంగప్రవేశం చేస్తున్నారు. అల్లు అర్జున్ కూతురు అర్హ బాలనటిగా పరిచయం అవుతోంది.






సమంత హీరోయిన్‌గా గుణశేఖర్ తీస్తున్న శాకుంతలం చిత్రంలో అర్హ నటిస్తోంది. దర్శకుడు శంకర్ కూతురు అదితి కూడా హీరోయిన్‌గా పరిచయం అవుతోంది. ఆమె తొలి చిత్రం తమిళ హీరో కార్తీ సరసన.

### పాతికేళ్లుగా పెరిగిన ధోరణి

20, 25 ఏళ్ల క్రితం ఒక వెల్లువలా నట వారసులు వచ్చారు. మెగాస్టార్ చిరంజీవి సోదరుడు పవన్ కళ్యాణ్ అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయితో పరిచయం అయ్యారు. తర్వాత సూపర్‌స్టార్ కృష్ణ కుమారుడు మహేష్‌బాబు *రాజకుమారుడు*గా అడుగుపెట్టారు. ప్రేమకథ సినిమాతో సుమంత్ ఎంట్రీ ఇచ్చారు. 2000వ సంవత్సరం తర్వాత నేటి కొత్తతరం సూపర్ స్టార్ల రాక మొదలైంది. నిన్ను చూడాలనితో జూనియర్ ఎన్టీఆర్, 2003లో కళ్యాణ్‌రామ్, *ఈశ్వర్*గా ప్రభాస్, *గంగోత్రి*తో అల్లు అర్జున్, చిరుతతో రామ్‌చరణ్, మంచు విష్ణు, మంచు మనోజ్ పరిచయం అయ్యారు.

మళ్లీ కొంత విరామం తర్వాత రానా, సుశాంత్, సుధీర్‌బాబు, సాయి ధరమ్‌తేజ్, వరుణ్‌తేజ్, నిహారిక, నాగచైతన్య, అల్లు శిరీష్, అఖిల్, వైష్ణవ్‌తేజ్, విజయ్ దేవరకొండ సోదరుడు ఆనంద్ దేవరకొండ, కీరవాణి కొడుకు శ్రీసింహ, పూరి జగన్నాథ్ కుమారుడు ఆకాష్ వచ్చారు. ఒక్క చిరంజీవి కుటుంబం నుంచి 10మంది పరిచయమయ్యారు ఈ 20 ఏళ్లల్లో. నాగార్జున కుటుంబం నుంచి ఐదుగురు, నందమూరి వారు నలుగురు, కృష్ణ ఫ్యామిలీ నుంచి నలుగురు, మంచు వారు ముగ్గురు... ఇలా ఫామిలీ ఫ్యాక్‌లు చాలా వచ్చాయి.

మరికొందరు తారల వంశోద్ధారకుళ్లు పరిచయమై... జనాల ఆమోదం పొందలేక ఇంటికి వెళ్లిన వారు కూడా ఉన్నారు. బ్రహ్మానందం కుమారుడు, ఎం.ఎస్ నారాయణ కొడుకు, నిర్మాత ఎం.ఎస్.రాజు పుత్రరత్నం. పూరి సోదరుడు వంటివారు ఈ జాబితాలోకి వస్తారు.

2021 నుంచి 2030 వరకు మరో కొత్త బ్యాచ్ రానుంది. అందులో వెంకటేష్ కొడుకు, మహేష్‌బాబు కొడుకు, పవన్‌కళ్యాణ్ కుమారుడు, రవితేజ కొడుకు ఉంటారు. ఇంకా మరికొందరు కూడా ఈ బ్యాచ్‌లో ఉంటారు. గత పాతికేళ్ల ట్రెండ్ చూస్తే ప్రతి ఐదేళ్లకు నట వారసుల బ్యాచ్ ఒకటి ఒకటి రంగంలోకి దిగుతోంది. ప్రేక్షకులు కూడా వారిని ఆదరిస్తున్నారు. హీరోలకు కొడుకు పుట్టగానే వారు హీరోగా ఎప్పుడు ఎంట్రీ ఇస్తారు అని ఆరాతీసే అభిమానుల గానం ఉంది.

అందుకే... తెలుగునాట నట వారసుల సంఖ్య పెరుగుతూనే ఉంది. బాలీవుడ్‌లో ఇటీవల నెపోటిజం విషయంలో చాలా రగడ జరిగింది. కానీ తెలుగునాట ఆ ఊసేలేదు. సంతోషంగా ఫ్యామిలీ ఫ్యామిలీ అంతా నటన ఉప్మా తిని బతికేస్తున్నారు.

UNDAVALLI
CONSTRUCTIONS

# PAY 10% NOW

# 0% INTEREST TILL POSSESSION

**668 LUXURY APARTMENTS**

**~~2 Bhk~~, 3 Bhk, 4 Bhk & 4 Bhk Duplex from 1200 SFT – 4160 SFT LUXURY FLATS**

APRERA APPROVED



## JUST A FEW MINUTES DRIVE FROM VIJAYAWADA AND AP SECRETARIAT

Club House / Swimming Pool / Kids Pool / Multi-Purpose Function Hall / Mini Theatre
Amphitheatre / Cafeteria / Well Equipped Gymnasium / Aerobics / Meditation Hall / Jogging Track
Yoga Room / Health Spa / Children's Play Area / Outdoor Cricket Court / Basket Ball Court
Badminton Court / Shuttle Court / Elder Parks / Squash Court / Table Tennis / World Class Sports






Design By CREATIVE ETHICS.COM +919032932953(INDIA)

SRIVALLI
PRAVAS
*Your Heaven on Earth*

# LETS YOUR DREAMS COME TRUE

**on VJA - GNT National Highway at KAZA TOLL PLAZA**

Bank Loans Available

+1 314 256 9132 (USA) 88 99 11 8888 (INDIA) sales@ucpl.io www.ucpl.io